ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
బుధవారం 9 ఏప్రిల్ 2025

సింహవాహనంపై రాముడి చిద్విలాసం


సింహవాహనంపై శ్రీరాముడు

- వైభవంగా కోదండరాముడి బ్రహ్మోత్సవాలు
- ఊరేగింపులో భారీగా పాల్గొన్న భక్తులు

ఒంటిమిట్ట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : కోదండరామ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం రాత్రి కోదండరాముడు సింహవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామ పురవీధుల్లో స్వామివారిని ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు కాయకర్పూరం సమర్పించి భక్తిని చాటుకున్నారు. స్వామివారి ఊరేగింపు వైభవంగా జరిగింది. భక్తజన బృందాలు, చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా మంగళవాయిద్యాల నడుమ కౌసల్యారాముని ఊరేగింపు కోలాహలంగా జరిగింది. ఉదయం 11 గంటలకు ఆలయంలో తిరుమంజనం వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, చందనంతో స్వామివార్లకు కంకణబట్టర్ రాజేష్‌కుమార్ అభిషేకం చేశారు. ఉదయం కోదండరాముడు వటపత్రశాయి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామ పురవీధుల్లో శ్రీరామచంద్రులు ఊరేగారు. భక్తజన కోలాటాలు, చెక్కభజనలు, మంగళ వాయిద్యాల నడుమ కేరళా వాయిద్యాల నడుమ స్వామి వారు గ్రామ పుర వీధుల్లో ఊరేగారు. వాహన సేవలో డిప్యూటీ ఈవో నటేష్‌బాబు, అధికారులు, హనుమంతయ్య, నవీన్, భక్తులు పాల్గొన్నారు.


ఆకట్టుకుంటున్న విద్యుద్దీపకాంతులు


స్వామి వారి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు


స్వామి వారి ఊరేగింపును మొబైల్‌లో చిత్రీకరిస్తున్న మహిళ


కోలాటం

అధికారుల సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు

- కల్యాణోత్సవానికి ముఖ్యమంత్రి రాక
- సమన్వయ సమావేశంలో టీటీడీ ఈవో శ్యామలరావు



కల్యాణ వేదిక వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న టీటీడీ ఈవో శ్యామలరావు, కలెక్టర్ శ్రీధర్, ఎస్పీ అశోక్‌కుమార్, టీటీడీ జేఈవో వీరబ్రహ్మం తదితరులు

జిల్లా అధికారులు, టీటీడీ అధికారుల సమన్వయంతో సీతారాముల కల్యాణోత్సవానికి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. మంగళవారం సాయంత్రం టీటీడీ పరిపాలనా భవనంలో కడప జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఎస్పీ అశోక్‌కుమార్, జేఈవో వీరబ్రహ్మంతో కలిసి ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కల్యాణోత్సవానికి 11వ తేదీ సాయంత్రం 6 గంటలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పట్టు వస్త్రాలను సమర్పించనున్నారని, కల్యాణ వేదిక వద్ద భక్తులు సౌకర్యవంతంగా కల్యాణాన్ని వీక్షించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఆలయ సమీపంలో సుమారు 3 వేల మంది భక్తులు వేచి ఉండేందుకు క్యూలైన్లో వెళ్లేందుకు జర్మన్ షెడ్‌లు ఏర్పాటు చేశామన్నారు. టీటీడీ విజిలెన్స్ నుంచి 350 మంది జిల్లా పోలీసులు, జిల్లా యంత్రాంగం నుంచి 2500 మంది భద్రతా సిబ్బందితో పటిష్ఠ భద్రత ఏర్పాటు చేశామన్నారు. 130 సీసీ కెమెరాలు, 20 డ్రోన్‌లను ఏర్పాటు చేశామన్నారు. కలెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ కల్యాణోత్సవానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తున్నదన్నారు. భద్రత, పార్కింగ్, అన్న ప్రసాదాల పంపిణీ, మరుగుదొడ్లు, నిరంతరం విద్యుత్ తదితర విభాగాలపై సమీక్షించి తగిన సూచనలు చేశామన్నారు. ఎస్పీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ టీటీడీ విజిలెన్స్ జిల్లా పోలీసులతో కలిసి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. అంతకు ముందుగా కల్యాణవేదిక ప్రాంగణాన్ని వీరు పరిశీలించారు.

కార్యక్రమంలో సీఎం ప్రోగ్రాం సమన్వయకర్త పెద్దూరి వెంకటేశ్, ఆర్డీవో జాన్‌ఇర్విన్, టీటీడీ అధికారులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

11న సీఎం చంద్రబాబు రాక

- ఒంటిమిట్టలో కల్యాణంలో పాల్గొననున్న సీఎం



కడప, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : ఒంటిమిట్టలో జరుగుతున్న కోదండరాముని ఉత్సవాల్లో భాగంగా ఈనెల 11న నిర్వహించనున్న కల్యాణ మహోత్సవానికి ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లాకు రానున్నారు. ఈ మేరకు కడప జిల్లా పర్యటన అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. 11వ తేదీ శుక్రవారం సాయంత్రం సీఎం చంద్రబాబు 3.35 గంటలకు విజయవాడ నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి 4.20కి కడప ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. ఎయిర్‌పోర్టు నుంచి 4.30కు రోడ్డుమార్గాన బయల్దేరి ఒంటిమిట్ట టీటీడీ గెస్ట్‌హౌస్‌కు చేరుకుంటారు. 6.05కు గెస్ట్‌హౌస్ నుంచి బయల్దేరి 6.10కి కోదండరామస్వామి దేవాలయం సందర్శిస్తారు. 6.10 నుంచి 6.15 వరకు పట్టువస్త్రాలు స్వామి వారికి సమర్పిస్తారు. 6.35కు కల్యాణ వేదిక వద్దకు చేరుకుంటారు. 6.45 నుంచి జరిగే కల్యాణంలో పాల్గొని పట్టువస్త్రాలు, తలంబ్రాలు అందించి కల్యాణంలో పాల్గొంటారు. 8.40కు టీటీడీ గెస్ట్‌హౌస్ చేరుకుని అక్కడే రాత్రికి బస చేస్తారు. 12న ఉదయం 8.50కి టీటీడీ గెస్ట్‌హౌస్ నుంచి బయలుదేరి 9.20కి కడప ఎయిర్‌పోర్టుకు చేరుకుని 9.30కు విజయవాడ బయలుదేరి వెళతారు.

పర్యాటకుల ఆకర్షణకు ప్రత్యేక చర్యలు

- రూ.కోటితో 12 అతిథి గృహాల ఆధునికీకరణ
- ఏపీ టూరిజం డీవీఎం శ్రీనివాసరావు


హార్సిలీహిల్స్‌లో అతిథి గృహాలను పరిశీలిస్తున్న డీవీఎం శ్రీనివాసరావు

బి.కొత్తకోట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌కు వచ్చే పర్యాటకులకు చక్కని వసతి, ఆతిథ్యంతో ఆకర్షితులయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని పర్యాటకశాఖ తిరుపతి డీవీఎం శ్రీనివాసరావు తెలిపారు. హార్సిలీహిల్స్ లోని యాత్రినివాస్‌లో ఎనిమిది, ఏడీసీ విండ్‌ఫాల్‌లో నాలుగు అతిథిగృహాలలో రెండు నెలలుగా జరుగుతున్న ఆధునికీకరణ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. కొత్తగా అమర్చిన ఏసీ, అధునాతన కిటికీలు, పీవోపీ, ఎలక్ట్రికల్ పనులను పరిశీలించి స్థానిక సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.కోటి వెచ్చించి అతిథి గృహాలను సుందరంగా తీర్చిదిద్దామని, వారం రోజులలో ఈ 12 అతిథి గృహాలు ఆన్‌లైన్ బుకింగ్‌కు సిద్ధంగా ఉంటాయని తెలిపారు. కాన్ఫరెన్స్ హాలును పరిశీలించి పెయింటింగ్, సీలింగ్, కిటికీలను అప్డేట్ చేయాలని ఆదేశించామన్నారు. రెండు నెలలుగా పర్యాటకుల సంఖ్య బాగా తగ్గిందని, ఈ వేసవికి పుంజుకుని ఏపీ టూరిజం ఆదాయం పెరుగుతుందని భావిస్తున్నట్లు చెప్పారు. పర్యాటకరంగంలో హార్సిలీహిల్స్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందని ఆ స్థాయిలో నిధులను కేటాయించి అన్ని శాఖల ద్వారా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. డీవీఎంతో పాటు డీఈ శ్రీనివాసరెడ్డి, హిల్స్ టూరిజం మేనేజర్ సాల్విన్‌రెడ్డి పాల్గొన్నారు.

మేడా కుటుంబ సభ్యులకు నోటీసులు

- ప్రభుత్వ భూములు ఆక్రమించారన్న ఫిర్యాదు
- వారం రోజుల్లోగా వివరణ ఇవ్వాలని జేసీ ఆదేశం

రాయచోటి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట మాజీ ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి కుటుంబ సభ్యులకు జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఈనెల 4వ తేదీ నోటీసులు జారీ చేశారు. నందలూరు మండలంలోని లేబాక గ్రామంలోని 121-6, 1279-2 సర్వే నెంబర్లలోని 109.23 ఎకరాలకు సంబంధించి అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై ఈ నోటీసులు జారీ చేశారు. నందలూరు తహసీల్దార్ ఇచ్చిన నివేదిక ప్రకారం ఏడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని లేకపోతే చర్యలు తీసుకుంటామని ఆ నోటీసుల్లో పేర్కొన్నారు. సర్వే నెంబర్ 121/5లో 3.50 ఎకరాలు డీకేటీ పట్టా పొందిన మేడా సుబ్బరామిరెడ్డికి నోటీసులు ఇచ్చారు. రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి లేబాక గ్రామంలో 2.50 ఎకరాలు ప్రభుత్వ భూమి పొందారు. మేడా మధుసూదన్‌రెడ్డి పేరిట పలు సర్వే నెంబర్లలో 17.28 ఎకరాలు, నందలూరు ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి భార్య పద్మ పేరుతో 5.65 ఎకరాలు, మేడా విజయశేఖర్‌రెడ్డి పేరుతో 2.57 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. మేడా కుటుంబ సభ్యులు 25 మంది పేరిట ప్రభుత్వ భూములు కాజేశారనే ఆరోపణలు ఉన్నాయి. అక్రమాలపై గత కొన్నేళ్లుగా ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నా వైసీపీ ప్రభుత్వంలో పట్టించుకోలేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికే రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి ఎస్టేట్‌లో నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ భూములు ఉన్నాయని రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకున్న విషయం తెలిసిందే.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- రూ. 23 కోట్లతో క్రిటికల్ కేర్ యూనిట్ నిర్మాణం
- రూ.20 లక్షల సీఎస్ఆర్ నిధులతో ఆర్‌వో, ఆక్సిజన్ ప్లాంట్‌ల నిర్మాణం
- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి


ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్యులు మెరుగైన వైద్య సేవలు అందించి ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజలకు మరింత నమ్మకం కలిగించాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. మంగళవారం రాయచోటి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో మంత్రి ఆధ్వర్యంలో హాస్పిటల్ డెవలప్‌మెంటల్ సొసైటీ నూతన సభ్యుల ఎన్నిక, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుంచి రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి రోగులు ఎక్కువ మంది వస్తుంటారని వైద్యులు అందుబాటులో ఉండి వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, వైద్యులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నారు. రాయచోటి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రూ.23 కోట్లతో మంజూరైన క్రిటికల్ కేర్ యూనిట్ నిర్మాణాన్ని త్వరలో చేపడతామని తెలిపారు. త్వరలో రూ.20 లక్షల సీఎస్ఆర్ నిధులతో ఆసుపత్రిలో ఆర్వోప్లాంట్, ఆక్సిజన్ ప్లాంట్ నిర్మించి రోగులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామని తెలిపారు. ఆసుపత్రికి కాంపౌండ్ వాల్ నిర్మాణం, అసంపూర్తిగా ఉన్న ఎలక్ట్రికల్ పనులను పూర్తి చేస్తామని, ఇక నుంచి ఆసుపత్రికి ఎటువంటి నీటి సమస్య తలెత్తకుండా ప్రతిరోజు మున్సిపాలిటీ వాటర్ వచ్చే విధంగా చర్యలు చేపడతామని చెప్పారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా, పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా బాబు, అర్చన విద్యాసంస్థల అధినేత మదన్‌మోహన్‌రెడ్డి, టీడీపీ జిల్లా మైనార్టీ కార్యదర్శి పఠాన్ నిస్సార్, ఆర్డీవో శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ వాసుబాబు, హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ డేవిడ్ సుకుమార్, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

కమనీయం సీతారాముల కల్యాణం

- వైభవంగా బ్రహ్మోత్సవాలు



కల్యాణోత్సవంలో మాంగల్యాన్ని భక్తులకు చూపుతున్న టీటీడీ వేదపండితులు, స్వామి వారికి పట్టువస్త్రాలు తీసుకువస్తున్న ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి

వాల్మీకిపురం, ఏప్రిల్ 8: వాల్మీకిపురం పట్టణంలోని పట్టాభిరాముడి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం టీటీడీ ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవం కన్నులపండువగా జరిగింది. సాయంత్రం సీతారామలక్ష్మణులకు ఊంజల్ మండపంలో భక్తజనం మధ్య ఊంజల్‌సేవ నిర్వహించారు. అనంతరం నూతన వధూవరులైన సీతారాములకు విశేష అలంకరణలు చేసి బైపాస్ రోడ్డులోని టీటీడీ స్థలంలో కల్యాణ వేడుకను వైభవంగా జరిపారు. మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చారణలు, భక్తుల నడుమ సీతారాముల కల్యాణం వేడుకగా జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. కల్యాణంలో పాల్గొన్న దంపతులకు టీటీడీ పట్టువస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

గరుడునిపై పట్టాభిరాముడి వైభవం...

కల్యాణోత్సవం అనంతరం సీతాలక్ష్మణ సమేతుడైన పట్టాభిరాముడిని తనకెంతో ప్రీతిపాత్రమైన గరుడ వాహనంపై పురవీధులలో నగరోత్సవం జరిగింది. టీటీడీ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. టీటీడీ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపీనాథ్, సూపరింటెండెంట్ మునిబాలకుమార్, ఆగమ సలహాదారులు శ్రీనివాసాచార్యులు, ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజు, అర్చకులు, కృష్ణప్రసాద్ భట్టార్, కృష్ణరాజు, సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, భాషికాచార్యులు, ధనుష్‌భట్టార్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం ఉదయం టీటీడీ ఆధ్వర్యంలో పట్టాభిరాముడిని బ్రహ్మరథంపై నగరోత్సవం, సాయంత్రం ధూళి ఉత్సవం వైభవంగా జరగనున్నాయి.


కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఎస్‌డీసీ రమను కోల్పోవడం తీరని లోటు

- కలెక్టర్ చామకూరి శ్రీధర్


ఎస్‌డీసీ రమ మృతికి సంతాపం తెలియజేస్తున్న కలెక్టర్ శ్రీధర్, జేసీ రాజేంద్రన్, తదితరులు

రాయచోటి (కలెక్టరేట్), ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): విధుల పట్ల ఎంతో నిబద్ధత కలిగిన హెచ్ఎన్ఎస్ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమను కోల్పోవడం జిల్లాకు తీరని లోటు అని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అన్నారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమ మరణం పట్ల మంగళవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో సంతాపసభను నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రమ ఎంతో నిబద్ధతగా విధులు నిర్వహించే వారని అటువంటి మంచి అధికారిని పోగొట్టుకోవడం దురదృష్టం అని తెలిపారు. జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ మొదటిసారిగా రమ పనిలో చూపించే నిబద్ధత గురించి చెప్పాడని ఆయన సిఫారసు ద్వారానే పీజీఆర్ఎస్‌కు స్పెషల్ ఆఫీసర్‌గా ఆమెను నియమించినట్లు తెలిపారు. ఆమె నియామకం తర్వాత పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంలో అన్నమయ్య జిల్లా ఎంతో వృద్ధి సాధించిందని తెలిపారు. 2005లో ఆమె రెవెన్యూ శాఖలో చేరినప్పటి నుంచి ఇప్పటి వరకు ఎటువంటి రిమార్క్ లేకుండా విధులను నిర్వహించడం స్ఫూర్తిదాయకమన్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని, ఆమె కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామన్నారు. జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ మాట్లాడుతూ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమను కోల్పోవడం ఎంతో బాధాకరమని, జిల్లాకు నూతనంగా వచ్చినప్పుడు జిల్లాలో పనిచేస్తున్న డిప్యూటీ కలెక్టర్ల పనితీరు గురించి విచారించినప్పుడు అత్యుత్తమ పనితీరును కనబరిచిన వ్యక్తి రమ అని తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణను సద్వినియోగం చేసుకోండి

- రాజంపేట సబ్‌కలెక్టర్ నిదియాదేవి


విలేరులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ నిదియాదేవి

రాజంపేట టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వ భూమిలో అనధికార ఆక్రమణలు చేసిన పేదలకు ఆ భూమిని క్రమబద్ధీకరించే పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాజంపేట సబ్‌కలెక్టర్ నిదియాదేవి తెలిపారు. మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలిగించని భూముల్లో నివాసాలు ఏర్పాటు చేసుకుని ఉంటే పేదలైన వారిని గుర్తించి ఆ భూములను వారికి క్రమబద్ధీకరించడానికి ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ప్రభుత్వం నుంచి అధికారిక పత్రాలు లేకుండా ఉన్న వారికి ఈ పథకం ఉపయోగపడుతుందన్నారు. ఆదాయ పన్ను కట్టేవారికి, కాంట్రాక్టు ఉద్యోగులకు, నాలుగు చక్రాల వాహనం ఉన్నవారికి (ట్రాక్టర్లు మినహా), నెలకు 300 యూనిట్లు పైబడి విద్యుత్ బిల్లులు కట్టేవారికి, నెలకు 12 వేలకు పైబడి ఆదాయం ఉన్నవారికి ఈ పథకం వర్తించదన్నారు. 10 ఎకరాల మిట్ట భూమి, 3 ఎకరాలకు పైబడి తరి భూమి ఉన్న వారికి వర్తించదన్నారు. నిరుపేదలు అయి ఉండి ప్రభుత్వ భూమిలో నివాసం కట్టుకున్న వారికి ఆ స్థలాన్ని వారి పేరిట ఇవ్వడానికి ప్రభుత్వం నిర్ణయించిందని, కావున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రధానంగా 150 చదరపు గజాల వరకు ఉన్న ఆక్రమణను ఉచితంగా క్రమబద్ధీకరిస్తామని తెలిపారు. ఈ పథకం ఈ ఏడాది డిసెంబరు 31వ తేదీ వరకు ఉంటుందన్నారు.

పాతాళానికి దోస ధరలు

- నష్టాల ఊబిలో రైతులు
- మొదట టన్ను రూ.22 వేలు
- ప్రస్తుతం రూ.4 వేలు

రైల్వేకోడూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): దోస పంటపై రైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అప్పులు తీరిపోతాయని ఆశపడ్డారు. ఉన్నపళంగా ధరలు పతనమయ్యాయి. వివరాల్లోకి వెళితే.... రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, చిట్వేలి, పెనగలూరు, పుల్లంపేట మండలాల్లో ఈ ఏడాది కుందన్, కోహినూర్ అనే రకాల దోసను రైతులు సాగు చేపట్టారు. పంట దిగుబడి ఆశించిన విధంగానే వచ్చింది. మొదటిగా టన్ను రూ. 22వేలు ధర పలికింది. ఉన్నపళంగా ధరలు టన్ను రూ.7వేలు, 6 వేలు వరకు తగ్గిపోయాయి. ప్రస్తుతం రూ.4వేలకు పడిపోయాయి. దీంతో కోసే వారు లేక రైతులు కాయలను చేలోనే వదిలేస్తున్నారు. ఈ సారి పండిన పంట రుచి, వాసన, రంగు, తీపి ఉంది. అయినా ధరలు మాత్రం లేవు. దీంతో పెట్టుబడి రాలేదని రైతులు దిగాలు చెందుతున్నారు. దోసతో కష్టాలు తీరిపోతాయని, అనుకున్న



కోసేవారు లేక పొలంలోనే కుందన్ దోసకాయలు



కోసిన కాయలను లోడింగ్‌కు తీసుకెళ్తున్న కూలీలు

ధరలు రాలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లోడింగ్ చేసేందుకు టన్నుకు రూ.700 తీసివేస్తారు. టన్నుకు షూట్ ప్రకారంగా 50 కిలోల కాయలు తీసివేస్తారు. ప్రస్తుతం టన్ను రూ.5000 ఉండగా రైతుకు చేతికి వచ్చేది రూ.4000 మాత్రమే. మొదటి కోతకు మాత్రమే ఎక్కువ ధరలు ఉన్నాయి. రెండో కోతకు ధరలు లేవని వ్యాపారులు, దళారులు చెప్పడంతో కోతలు చాలా చోట్ల ఆగిపోయినాయి. రైతులు వ్యాపారుల దగ్గర నుంచి పెట్టుబడి తీసుకుని వచ్చి సాగుకు ఖర్చు చేశారు. అయితే ఆశించిన ధరలు లేకపోవడంతో వడ్డీలు పెరుగుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైల్వేకోడూరు మండలంలో 500 ఎకరాలు, ఓబులవారిపల్లె మండలంలో 400 ఎకరాలు, చిట్వేలి మండలంలో 300 ఎకరాలు, పుల్లంపేట మండలంలో 300 ఎకరాలు, పెనగలూరు మండలంలో 250 ఎకరాల్లో దోస సాగు చేసినట్లు తెలుస్తోంది. ఎకరా దోస సాగు ఖర్చు కూలీలు, దున్నకాలు, ఎరువులు, మల్చింగ్‌షీట్, మందులు తదితర వాటికి రూ. 80వేల నుంచి రూ.1లక్ష వరకు వస్తుందని రైతులు తెలిపారు. ఎకరాకు 200 గ్రాముల విత్తనాలు అవసరమని, కిలో విత్తనాలు రూ.54,000 అవుతుందన్నారు. రైల్వేకోడూరు నుంచి దోస కాయలను తమిళనాడు, విజయవాడ, హైద్రాబాద్, కేరళ, బెంగుళూరు తదితర ప్రాంతాలకు ఎగుమతి చేశారు. ప్రస్తుతం కోతలు జరగడం లేదు. స్థానికంగా రైతులు కోసి చిరు వ్యాపారులకు అమ్ముతున్నారు.

దోస రైతు అతలాకుతలం



పెట్టిన పెట్టుబడులు వస్తాయని ఆశించాం. పంట దిగుబడి బాగా వచ్చింది. లాభాలు వస్తాయని అనుకున్నాం. మొదటి కోతకు టన్నుకు రూ.22,000 వచ్చింది. రెండో కోత కు ధరలు పడిపోయాయి. రంజాన్ మాసంలో ఎక్కువగా డిమాండ్ ఉంటుందని అనుకున్నాం. అయితే ధరల ఇంత స్థాయిలో పడిపోతాయని అనుకోలేదు.

-జి.సురేష్‌రాజు, రైతు, అనంతరాజుపేట

పెట్టిన ఖర్చులు కూడా రాలేదు



పెట్టిన ఖర్చులు కూడా రాలేదు. దోసలో ఎక్కువగా లాభాలు వస్తాయని అనుకున్నాం. నియోజకవర్గ వ్యాప్తంగా రైతులు అందరూ దోస పంటను వేశారు. దళారులు రైతులను మోసం చేస్తున్నారు. ఈ వ్యవస్థ లేకుంటే చాలా వరకు రైతులు బాగుపడతారు.

- జి.వెంకటసుబ్బయ్య, రైతు, శింగిరివారిపల్లె

జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● జిల్లా మలేరియా నివారణ అధికారి రామచంద్రారెడ్డి

సుండుపల్లె, ఏప్రిల్ 8(ఆంధ్ర జ్యోతి): జ్వరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నమయ్య జిల్లా మలేరియా నివారణ అధికారి రామచంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం సుండుపల్లె, రాయవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్లు, వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కీటక జనిత వ్యాధులు మలేరియా, డెంగ్యూ, ఫైలేరియా, చికెన్‌గునియా, మెదడు వాపు జ్వరాలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఫ్రైడే సర్వే, వెక్టార్ కంట్రోల్ యాప్‌ల ద్వారా మురికినీటి కాలువలు మురికి గుంటల్లో దోమల లార్వా వృద్ధి చెందకుండా ఉండుటకు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. జ్వరాలపైన ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం ఆసుపత్రిలోని రికార్డులను, ల్యాబ్ నిర్వహించే గదిని పరిశీలించారు. మండల కేంద్రంలోని కార్తికేయ నగర్‌లో ఇండ్ల మధ్యలో ఉండే మురికికుంటను పరిశీలించారు. ఈ విధంగా ఇండ్ల మధ్యలో మురికినీటి కుంటలు ఉండడం వలన దోమలు అధికమై రోగాల భారిన పడే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్‌యూనిట్ ఆఫీసర్ జయరామయ్య, డాక్టర్ ఫర్హాఖానం, రాయవరం వైద్యాధికారి శేఖర్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



కార్తికేయనగర్‌లో మురికినీటి కుంటను పరిశీలిస్తున్న మలేరియా నివారణ అధికారి

విద్యామిత్ర స్టాక్ పాయింట్ సందర్శన

రాయచోటిటౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని నేతాజీ సర్కిల్‌లో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలను మంగళవారం రాష్ట్ర పరిశీలకుడు డాక్టర్ పెంచలయ్య సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు అవసరమైన 9 రకాల వస్తువులతో పాటు గిఫ్టులు ఇవ్వడానికి ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం రోజునే విద్యార్థులకు ఈ కిట్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. మండలానికి సంబంధించిన విద్యార్థులకు అందరికీ పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు, యూనిఫామ్, బ్యాగ్, షూసాక్స్, బెల్టులు మండల కేంద్రానికి నేరుగా చేరవేస్తామన్నారు. ఎంపికైన మండల స్టాక్ పాయింట్లు అనువుగా ఉన్నాయా లేదా అని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 14 నుంచి స్టాక్ పాయింట్లకు వస్తువులు ఒక్కొక్కటిగా చేరవేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రమణ్యం, జిల్లా ప్రత్యామ్నాయ పాఠశాలల సమన్వయకర్త ఉలవల వెంకట్రామయ్య, మండల విద్యాశాఖ అధికారులు బాలాజీనాయక్, వెంకటశివారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ అలీ, సీఆర్పీలు పాల్గొన్నారు.

విశిష్ట సంఖ్య లేకుంటే రాయితీలు అందవు

● జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రానాయక్



వ్యవసాయశాఖ మండల అధికారులకు సూచనలిస్తున్న డీఏవో

మదనపల్లెటౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఫార్మర్ రిజిస్ట్రేషన్ నెంబర్ లేకుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీలు అందవని డీఏవో చంద్రానాయక్ తెలిపారు. మంగళవారం స్థానిక సీఎల్ఆర్సీ భవనంలో డివిజన్‌లోని ఏవోలు, ఏఈవోలతో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 1.78లక్షల మంది రైతులుండగా, 77 శాతం మంది రైతులు మాత్రమే విశిష్ట సంఖ్య నమోదు చేయించుకున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యం ప్రకారం 85 శాతం మంది రైతులు విశిష్ట సంఖ్య పొందితేనే రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతులం దరికీ రాయితీలు వర్తిస్తాయన్నారు. ముఖ్యంగా పీఎం కిసాన్ యోజన పథకం ద్వారా ఇప్పటికి 19 ఇన్‌స్టాల్‌మెంట్లు వచ్చాయని ఈ ఏడాది 20వ ఇన్‌స్టాల్‌మెంట్ వస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం రూ.6 వేలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.14 వేలు కలిపి మొత్తం రూ.20 వేలు కిసాన్ యోజన పథకం కింద అందుతుందన్నారు. విశిష్ట సంఖ్య పొందిన రైతులకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుందన్నారు. వ్యవసాయ యాంత్రీకరణ పథకానికి ప్రభుత్వం రూ.2.20 కోట్ల నిధులు మంజూరు చేస్తే ఇప్పటి వరకు రూ.1.20 కోట్లు మాత్రమే రైతులు వినియోగించుకున్నారన్నారు. రెండు సీజన్లతో వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో మూడో సీజన్‌లో కూడా సాగుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పిస్తోందన్నారు. దీనికి రైతులకు 50 శాతం రాయితీతో వేరుశనగ విత్తనాలు పంపిణీ చేసే అవకాశం ఉంటుందన్నారు. సమావేశంలో ఏడీఏ శివశంకర్, ఏవోలు పాల్గొన్నారు.

బస్సు ఢీకొని వృద్ధుడికి తీవ్రగాయాలు

రాజంపేటటౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రాజంపేట పాతబస్టాండులో స్థానిక డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మంగళవారం రాత్రి మీరావల్లి అనే వృద్ధుడిని ఢీకొంది. ఈ సంఘటనలో మీరావల్లి కాలికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు ఆయన్ను రాజంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యం

● మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

చిన్నమండెం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వండాడి గ్రామం గొర్లముదివీడు క్రాస్ నుంచి తూర్పుపల్లె వరకు కోటి రూపాయలతో నిర్మించిన నూతన తారు రోడ్డును మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోనే రాయచోటి నియోజకవర్గాన్ని ఆదర్శంగా అభివృద్ధి చేసి ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరిక నెరవేర్చడం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలోని రాయచోటి, సంబేపల్లె, గాలివీడు, లక్కిరెడ్డిపల్లె, రామాపురం, చిన్నమండెం 6 మండలాలకు రూ.450 కోట్లు ఖర్చు చేసి వెలిగల్లు ప్రాజెక్టు నుంచి నీటి సరఫరా చేసి మంచినీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు. వైసీపీ ప్రభుత్వంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి ఎటువంటి అభివృద్ధి పనులు చేయలేదని, కేవలం 9 నెలల కాలంలోనే రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రిని వంద నుంచి 150 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేశామన్నారు. త్వరలో రూ.350 కోట్లతో హంద్రీ-నీవా కాలువల ద్వారా ఈ ప్రాంతానికి సాగునీరు అందజేస్తామని తెలిపారు. రాబోయే రోజుల్లో ప్రతి గ్రామానికి సిమెంటు రోడ్లు, డ్రైనేజీ కాలువలు, వీధి లైట్లు, మంచినీటి సదుపాయం తదితర అన్ని మౌలిక వసతులు కల్పించి రాయచోటి నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా మంత్రికి వండాడి గ్రామ ప్రజలు గజమాలతో ఘనస్వాగతం పలికారు. అనంతరం పూజా కార్యక్రమాలు నిర్వహించి రిబ్బన్ కట్ చేసిన నూతన తారు రోడ్డును మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధిలో బీజేపీదే కీలకపాత్ర

● బీజేపీ రాష్ట్ర కోఆపరేటివ్ సెల్ కన్వీనర్ గోపాల్‌రెడ్డి

బి.కొత్తకోట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధిలో బీజేపీది కీలకపాత్ర అని ఆ పార్టీ కో ఆపరేటివ్ సెల్ రాష్ట్ర కన్వీనర్ ఎస్.గోపాల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం బి.కొత్తకోట మండలంలోని అమరనారాయణపురంలో తంబళ్లపల్లె నియోజకవర్గ స్థాయి క్రియాశీలక సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలను గ్రామీణ స్థాయి ప్రజల్లోకి ఎలా తీసుకువెళ్లాలనే విషయాలను వివరించారు. రాష్ట్ర గిరిజన మోర్చా కోకన్వీనర్ కావాడి రవీంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వం ఖర్చు చేస్తున్న నిధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్రంలో బీజేపీ భాగస్వామ్యంతో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉందని, ప్రతి మండలంలోనూ ప్రభుత్వ కార్యక్రమాలలో బీజేపీకి భాగస్వామ్యం ఉండేలా కార్యకర్తలు దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల కృష్ణమూర్తి, నాయకులు పిల్లాస్వామి, శోభ, శంకర్‌రెడ్డి, మండలకన్వీనర్లు జయరామిరెడ్డి, శ్రీకాంత్, వెంకట్రహణ, గుణశేఖర్, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు క్రమబద్ధీకరించుకోండి

● సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్

మదనపల్లెటౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబరు 30 ప్రకారం అభ్యంతరం లేని ఇళ్ల స్థలాలను క్రమబద్ధీకరించుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ సూచించారు. మంగళవారం స్థానిక సబ్‌కలెక్టరేట్ పీజీఆర్ఎస్ భవనంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2025 జనవరి 29న రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో 30 విడుదల ప్రకారం అభ్యంతరం లేని ప్రభుత్వ స్థలాలను క్రమబద్ధీకరించుకోవచ్చన్నారు. 2019 అక్టోబరు 15కు ముందు మహిళలు ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉండాలన్నారు. ఇటుకలు, మోల్డింగ్ లేదా రేకుల పైకప్పు తప్పనిసరిగా ఉండాలన్నారు. దీంతో పాటు ఆ ఇంటి పన్ను, విద్యుత్ మీటర్ బిల్లులు, కొళాయి పన్నులు లేదా రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ ఉండాలన్నారు. ఏడాదికి రూ.1.20 లక్షల లోపు ఆదాయం ఉండాలని, మూడు ఎకరాల మడి, లేదా 10 ఎకరాల చేను ఉండొచ్చన్నారు. ఆదాయపన్ను చెల్లించే వారు, నాలుగు చక్రాల వాహనం వున్న మహిళలు అనర్హులన్నారు. వీటితో పాటు దరఖాస్తు చేసుకునే మహిళ పేరుతో సొంత ఇళ్లు ఉండకూడదన్నారు. పై నిబంధనల మేరకు అర్హులైన వారు గ్రామ సచివాలయంలో, మీసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. బీపీఎల్ స్థాయిలో వున్న మహిళలకు 150 గజాల లోపు స్థలానికి ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయిస్తారని, 150 నుంచి 300 చదరపు గజాల లోపు స్థలం వుంటే స్థలం బేసిక్ ధరలో 15శాతం రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలన్నారు. 300 నుంచి 450 చదరపు గజాల స్థలం ఉంటే 50 శాతం రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలన్నారు. ఏపీఎల్ స్థాయి వారైతే 200 శాతం మార్కెట్ ధర చెల్లించి క్రమబద్ధీకరించుకోవచ్చన్నారు. ఈ అవకాశం 2025 డిసెంబరు 31 వరకు మాత్రమే ఉంటుందన్నారు. వివరాలకు ఆయా మండలాల తహసీల్దార్ కార్యాలయాల్లో తెలుసుకోవచ్చని సబ్‌కలెక్టర్ చెప్పారు.

రేపు విద్యుత్ లోక్‌అదాలత్



మాట్లాడుతున్న విద్యుత్ శాఖ ఈఈ రాజశేఖర్

రాజంపేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రాజంపేట డివిజనల్ విద్యుత్ కార్యాలయం నందు 10వ తేదీ గురువారం ప్రత్యేక విద్యుత్ అదాలత్ జరుగుతుందని ఈఈ ఎస్.రాజశేఖర్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ లోక్‌అదాలత్ చైర్‌పర్సన్ విశ్రాంత జడ్జి శ్రీనివాసు ఆంజనేయమూర్తి, ఆర్థిక సభ్యుడు కె.రామ్మోహన్‌రావు, సాంకేతిక సభ్యుడు అంజనికుమార్, స్వాతంత్ర్య సభ్యులు విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఈ అదాలత్ జరుగుతుందన్నారు. రాజంపేట పట్టణం రూరల్, పెనగలూరు, పుల్లంపేట, కోడూరు, చిట్వేలి, ఓబులవారిపల్లె నందలూరు మండలాల పరిధిలోని వినియోగదారులు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ విద్యుత్ సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. పదో తేదీ ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.

కవ్వింపు చర్యలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోండి

● వన్‌టౌన్ ఎస్ఐకి ఫిర్యాదు చేసిన వైసీపీ నేతలు

కడపక్రైం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కవ్వింపు చర్యలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని వైసీపీ నేతలు పోలీసులను కోరారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ మాజీ డిప్యూటీ సీఎం సోదరుడు అహ్మద్‌బాషాను బాంబేలో కడప పోలీసులు అరెస్టు చేశారంటూ వారి ఇంటి సమీపంలో టీడీపీ నేతలు బాణాసంచాను పేల్చడంతో పాటు స్వీట్లు పంచారని వైసీపీ నేతలు నాగయ్య, యానాదయ్యతో పాటు పలువురు కడప వన్‌టౌన్ ఎస్ఐ అమర్‌నాథరెడ్డికి మంగళవారం ఫిర్యాదు చేశారు. వీరిలో టీడీపీకి చెందిన సుబ్బారెడ్డి, యువరాజ్, పటాన్ ఖాజాపీర్, జియావుద్దీన్, రాజా, ఆరిఫ్, ఫైజల్ మరో రెండువందల మంది ఉన్నారని, నగరంలో పోలీసు 30 యాక్టు అమలులో ఉన్నా వారంతా కవ్వింపు చర్యలకు పాల్పడడం ఏమిటని ప్రశ్నించారు. వీరిపై కేసు నమోదు చేయాలని కోరారు.



ఎస్ఐ అమర్‌నాథ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న వైసీపీ నేతలు

ఉద్యానంతో ఉద్దీపనం

● ఉపాధి హామీ పథకంలో ఉద్యాన పంటలకు ప్రోత్సాహకాలు

● దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న రైతుల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

● మామిడికి ప్రత్యామ్నాయాలపై దృష్టి

పీలేరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటల ద్వారా రైతుల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా 25 రకాల పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సాహకాలు అందిస్తోంది. గతంలో మామిడికే పరిమితమైన ఈ ప్రోత్సాహకాలను ప్రస్తుతం అనేక పంటలకు అందిస్తూ రైతుల్ని చైతన్యవంతుల్ని చేస్తోంది. తోటల సాగు పథకం ద్వారా గ్రామీణ కుటుంబాలకు ఉపాధి అవకాశాలు అందించడంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా స్థిరమైన తోటల సాగు విధానాలను ప్రోత్సహించడమే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. 0.25 ఎకరాల నుంచి 5 ఎకరాల వరకు పలు పండ్ల తోటలు సాగు చేసుకునే ఆసక్తి ఉన్న రైతుల్ని గుర్తించి వారిని చైతన్యవంతుల్ని చేయాలని ఉపాధి సిబ్బందిని ఆదేశించింది.



పీలేరులో మామిడి తోటలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏపీవో అశోక్ (ఫైల్)

ఎవరు అర్హులు

- షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలకు చెందిన రైతులు
- దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారు
- ఉపాధి హామీ కార్డు కలిగిన చిన్న, సన్నకారు రైతులు
- సంచార జాతులకు చెందినవారు
- డీనోటిఫైడ్ తెగలకు చెందినవారు
- భూసంస్కరణల లబ్ధిదారులు
- ప్రధాన మంత్రి ఆవాస యోజన లబ్ధిదారులు
- అటవీ నివాసులు
- ప్రత్యేక ప్రతిభావంతులు కలిగిన కుటుంబాలు
- మహిళల నేతృత్వం కలిగిన కుటుంబాలు

దరఖాస్తు చేసుకునే విధానం

ఆసక్తి గల రైతులు తమ గ్రామ ఫీల్డు అసిస్టెంటును గానీ, మండల కేంద్రాల్లో ఉండే ఉపాధి హామీ పథకం కార్యాలయంలో సంప్రదించాలి. జూన్ మాసం ఆఖరు వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. లబ్ధిదారులను గ్రామసభల ద్వారా ఎంపిక చేస్తారు. ఈ పథకం ద్వారా 2024-25 ఆర్థిక సంవత్సరంలో పీలేరు మండలంలో అధికారులు 129 మంది రైతుల ద్వారా 283 ఎకరాల్లో వివిధ పండ్ల తోటలను సాగు చేయించారు. 2025-25 సంవత్సరంలో 150 ఎకరాల్లో కొత్త తోటలు సాగు చేయించాలని అధికారులు నిర్ణయించారు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి



చిన్న, సన్న కారు రైతులు పండ్ల తోటల పెంపకం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. పండ్ల తోటల సాగుపై ఆసక్తి ఉన్నప్పటికీ ఆర్థిక స్తోమత లేని వారికి ఈ పథకం చక్కని అవకాశం. ఆసక్తి గల వారు వీలైనంత త్వరగా సంప్రదిస్తే వారికి కావాల్సిన సహకారం అందిస్తాం.

- అశోక్‌రెడ్డి, ఏపీవో, ఉపాధి హామీ పథకం

వివిధ పండ్ల తోటలు, మూడేళ్ల వరకు ఒక ఎకరాకు లభించే ప్రోత్సాహకాలు

జాఫ్రా (సింధూరీ, లిప్‌స్టిక్ చెట్టు అనోటా అని కూడా పిలుస్తారు)	రూ.1,36,871
అవకాడో	రూ.1,16,254
సిల్వర్ ఓక్	రూ.1,52,295
పనస	రూ.67,163
ఆయిల్ పామ్	రూ.55,771
కకోవా (చాక్లెట్)	రూ.1,59,133
రబ్బర్ ప్లాంటేషన్	రూ.1,75,485
ఆపిల్ బేర్ (రేగు పండు)	రూ.1,26,186
రోజా పువ్వు	రూ.62,355
మల్లె పూలు	రూ.55,124
మునగ	రూ.27,515
మామిడి	రూ.1,09,950
జీడి పప్పు	రూ.98,684
స్వీట్ ఆరెంజ్	రూ.1,37,750
ఆసిడ్ లైమ్	రూ.1,46,311
జామ	రూ.1,46,311
తైవాన్ జామ	రూ.2,51,224
సపోట	రూ.95,584
కొబ్బరి	రూ.99,183
నేరేడు	రూ.68,163
చింత	రూ.68,403
సీతాఫలం	రూ.2,14,178
దానిమ్మ	రూ.2,16,417
అంజీర	రూ.1,67,324
డ్రాగన్ ఫ్రూట్	రూ.2,00,714

'ఓపి'క ఉండాల్సిందే...

● వేధిస్తున్న సర్వర్ సమస్య ● గంటల తరబడి నిరీక్షణ
● సర్వజన ఆసుపత్రిలో రోగులకు కష్టాలు

కడప సెవెన్ రోడ్స్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్) సమస్యలతో సతమతమవుతూనే ఉంది. రోజుకో సమస్యతో రోగులకు నరకయా తన చూపుతోంది. 2006లో ఆసుపత్రి ప్రారంభించినపుడు ఏర్పాటు చేసిన వ్యవస్థలతోనే నెట్టుకొస్తున్నారు. రోజురోజుకు వైద్యం కోసం వచ్చే రోగుల సంఖ్య పెరుగుతోంది. జిల్లా నలుమూలల నుంచే కాకుండా చుట్టుపక్కల జిల్లాల నుంచి సైతం రోగులు వైద్యం కోసం ఇక్కడకు వస్తుంటారు. ప్రతి రోజు సుమారు 1200 నుంచి 1500 ఓపీ తీసు కుంటారు. సాధారణ వైద్య పరీక్ష కోసం వచ్చే వారితో పాటు అదనంగా సదరం సర్టిఫికెట్లు పొందేందుకు వచ్చేవారు ఉంటారు. వీరందరితో ప్రతి రోజు సర్వజన ఆసుపత్రి కిటకిటలాడుతూ ఉంటుంది. ఈ రద్దీకి సరిపడా ఓపీ కౌంటర్లు లేకపోవడం, రోగులకు తగ్గట్లు సర్వర్ సరిగా పనిచేయక వారి ఓపికకు పరీక్ష పెడుతోంది.

సర్వర్ సమస్యతో సమయం వృథా

సర్వజన ఆసుపత్రిలో ఓపీ కేవలం 12గంటల వరకు మాత్రమే అందుబాటులో ఉంటుంది. 12 గంటలు దాటితే ఓపీ కౌంటర్లు మూసేస్తుంటారు. సర్వర్ సమస్యతో ఒక్కసారి గంటల తరబడి వేచి ఉన్నా ఓపీ దొరక్క రోగులు ఇబ్బంది పడుతున్నారు. సర్వర్ సరిగా పనిచేయడం లేదని కొంతమంది పేద చదువురాని రోగులకు అర్థంకాని పరిస్థితిలో అయోమయానికి గురవుతున్నారు. వైద్యానికి నిరీక్షణ అయితే ఓకే గాని ఓపీ కోసం నిరీక్షించడం ఏంటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చే వారు త్వరగా వైద్య సేవలు పొంది ఇంటికి చేరాలని చూస్తుంటారు. అయితే తరచూ సర్వర్ మొరాయింపుతో సమయం అంతా ఓపీ వద్దే వృథా అవుతోందని వాపోతున్నారు.

వేధిస్తున్న ఓటీపీ సమస్య

ఓపీ చీటీ పొందడానికి సర్వర్ సమస్యతో పాటు ఓపీ ఎంట్రీ చేయడానికి రోగి వివరాలు పొందుపర్చడానికి మొబైల్ ఓటీపీతో మరో సమస్య. చాలా మంది గ్రామీణ పేద రోగులకు స్మార్ట్ ఫోన్‌లు ఉండవు. పైపెచ్చు గ్రామీణ మహిళల్లో మొబైల్ లేని వారు ఉంటారు. సర్వజన ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చే రోగులకు కచ్చితంగా వారి ఆరోగ్య వివరాలను సులభంగా తెలుసుకునే విధంగా ఫోన్‌లో పొందుపరుస్తుంటారు. రిజిస్ట్రేషన్ కోసం ఓటీపీ నమోదు చేయాల్సి ఉంటుంది. ఇవేవీ తెలియక కొందరు ఓపీ కోసం తికమకపడుతున్నారు. వైద్యం కోసం వచ్చే రోగులు ఆదిలోనే ఓపీ కోసం అవస్థలు పడుతున్నారు. ఓపీ అందాక 12 గంటల తర్వాత డాక్టర్లు అందుబాటులో ఉండ కపోవడంతో రోగులు అవస్థలు పడుతున్నారు. ఆసుపత్రి అధికారులు రోగులకు కాస్తో కూస్తో ఉపశమనం కలిగేవిధంగా ఏర్పాట్లు చేసినా పూర్తిస్థాయిలో సహాయ పడలేక పోతున్నారు. రోగులకు ఓపీ కష్టాల నుంచి శాశ్వతగా పరిష్కారం ఎపుడు దొరు కుతుందో అని ఆశగా ఎదురుచూస్తున్నారు.

రోగులకు ఇబ్బంది లేకుండా చేస్తున్నాం.



సర్వర్ సమస్యతో ఓపీ ఆలస్యం అవుతున్న మాట వాస్తవమే. సర్వర్ సమస్య ఉంటే మాన్యువల్‌గా ఓపీ ఇవ్వమని చెప్పాము. ఇక మొబైల్ లేని వారికి సిబ్బంది తమ సొంత ఫోన్‌ల ద్వారా రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. రోగులకు ఇబ్బంది కలుగకుండా ప్రతిరోజు నర్సింగ్ విద్యార్థులతో రోగులకు సహాయం అందిస్తున్నాం. రోగులకు ఇబ్బంది కలుగకుండా మరింత ఏర్పాట్లు చేయడానికి ప్రయత్నిస్తాం.

-డాక్టర్ శ్రీనివాసులు, సీఎస్ఆర్ఎంఓ, సర్వజన ఆసుపత్రి, కడప





సర్వర్ సమస్యతో ఇబ్బందులు పడుతున్న రోగులు, ఓపి కోసం క్యూలో ఉన్న రోగులు

ప్రతి గ్రామం పరిశుభ్రంగా ఉండాలి

● స్వచ్ఛభారత్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు ఊర్మిలాదేవి



నాడెప్ తొట్లను పరిశీలిస్తున్న స్వచ్ఛభారత్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు

వల్లూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామం పరిశుభ్రంగా ఉంటే.. అంటు వ్యాధులు రాకుండా ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని స్వచ్ఛభారత్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు ఊర్మిలాదేవి అన్నారు. మంగళవారం వల్లూరు గ్రామ పంచాయతీలో ఆమె క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించారు. ముందుగా గ్రామమంతా కలియ దిరిగారు. అనంతరం స్థానిక మండల పరిసత్ పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలతో పాటు అక్కడున్న టాయిలెట్లను పరిశీలించి.. విద్యా శాఖ అధికారులు, ఉపాధ్యాయులు, అంగన్వాడీలతో మాట్లాడారు. ప్రతి రోజూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని పరిశీలించి.. మాట్లాడుతూ ఇళ్లలోని చెత్త నుంచి వేరు చేసిన వ్యర్థపదార్థాలను వానపాముల ద్వారా ఎరువుగా తయారు చేసేం దుకే ఎస్‌డబ్ల్యూపీసీలను ఏర్పాటు చేశారన్నారు. గ్రీన్ అంబాసిడర్లు ప్రతిరోజూ తప్ప కుండా డోర్ టు డోరు వెళ్లి చెత్తను సేకరించాలన్నారు. గ్రామాలల్లో చెత్త ఎక్కడ పడితే అక్కడ వేయకుండా పరిశుభ్రంగా ఉండేలా పనిచేయాలన్నారు. స్వచ్ఛ భారత్ ఎంఎస్ కన్సల్టెంట్ శివనారాయణ, డిస్ట్రిక్ట్ కన్సల్టెంట్ సూర్య ప్రకాశ్‌రెడ్డి, జిల్లా కోఆర్డినేటరు సందీప్, వల్లూరు ఎంపీడీవో రఘురాం, ఎమ్మార్పీ నాగముని, పంచాయతీ కర్యాదర్శి శ్రీనివాసులు, స్వచ్ఛభారత్ అధికారులు, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

యాక్సెస్ హెల్త్ కేర్ సేవలు అభినందనీయం



కృత్రిమ కాళ్ల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జేసీ అదితిసింగ్

కడప కలెక్టరేట్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): యాక్సెస్ హెల్త్ కేర్ చెన్నై వారి సేవలు అభినందనీయమని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ కొనియాడారు. మంగళవారం కలెక్టరేట్ సభాభవనంలో జిల్లాలోని విభిన్న ప్రతిభావంతుల కోసం ప్రత్యేక నియమించిన కృతిమ కాళ్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా జేసీ మాట్లాడుతూ గత నెల 6,7వ తేదీలలో 219 మంది కాలు కోల్పయిన విభిన్న ప్రతిభావంతులకు కాలు కొలతలు తీసుకున్నారన్నారు. వారందరికీ యాక్సెస్ హెల్త్ కేర్, ఫ్రీడమ్ ట్రస్ట్ చెన్నై స్పాన్సర్స్ తోడ్పాటుతో ఆధునిక కృతిమ కాలు ఒక్కొక్కటి రూ.51వేలతో మొత్తం 67 మందికి కృతిమ కాళ్లు అమర్చడం అభినందనీయమన్నారు. ట్రస్ట్ ఫౌండర్ సుందర్ మాట్లాడుతూ ఫ్రీడమ్ ట్రస్ట్ ఇలాంటిసేవా కార్యక్రమాల్లో భాగంగా ఉండటం గర్వంగా ఉందన్నారు. యాక్సెస్ హెల్త్ కేర్ ప్రతినిధి ఇలవేందన్ మాట్లాడుతూ వైఎస్సార్ కడప జిల్లాలో విభిన్న ప్రతిభావంతుల కోసం తన వంతు సహాయ సహకారాలు అందించడం సంతోషంగా ఉందన్నారు. ట్రస్ట్ మెంబరు సతీష్‌రెడ్డి, విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు ఆర్వీ క్రిష్ణ కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

కృషి పట్టుదలతో విజయం సొంతం

కడప ఎడ్యుకేషన్,ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రణాళికబద్ధమైన కృషి, పట్టుదల, విజయతీరాలను చేర్చుతాయని కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి అన్నారు. మంగళవారం యోగివేమన యూనివర్సిటీలో ఉద్యోగ ఉపాధి అవకాశాలపై యూనివర్సిటీలో ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులు అవకాశాలను ఉపయోగించుకోవాలని కోరారు. హైదరాబాద్ కెరీర్‌కన్సల్టెంట్‌సంస్థ సీఈఓ రోహిత్‌రావు మాట్లాడుతూ సరైన ప్రణాళిక, క్రమశిక్షణ ఉద్యోగ అవకాశాలపై విద్యార్థులకు మెళకువలను ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ ఆచార్య జి.విజయభారతి, సభ్యులు డాక్టర్ గణేష్ నాయక్ మాట్లాడారు. కార్యక్రమంలో హైదరాబాద్ కెరీర్ కన్సల్టెంట్ సంస్థ పత్తిని, హృత్విక్, మణికంఠ, ప్రియ, మేఘన, సాకేత్, అభినయ, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చూడండి : మంత్రి

పులివెందుల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పరిధిలో ఎక్కడ తాగునీటి సమస్య లేకుండా చూడాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ అధ్యక్షతన మధ్యాహ్నం అన్ని శాఖలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖల వారీగా ప్రస్తుతం ఏం పనులు చేస్తున్నారు, ఏం పనులు చేపట్టబోతున్నారు, ఎలాంటి పనులు కావాలి అనే మూడు అంశాలపై రివ్యూ సాగింది. ముఖ్యంగా తాగునీటి సమస్యపైన మంత్రి స్పందిస్తూ తాగునీటి అవసరాల కోసం నూతనంగా బోర్లు ఏర్పాటు చేస్తే వాటికి వెంటనే విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. ఇటీవల జరిగిన అరటిపంట నష్టానికి సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పంట నష్టపోయిన ఏ రైతుకు అన్యాయం జర గకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సోలార్‌పైన ప్రజలకు ఎలాంటి అవగాహన కల్పిస్తున్నారని ట్రాన్‌కో అధికారిని ప్రశ్నించగా అందుకు ఆయన సరైన సమాధానం చెప్పకపోవడంతో మండిపడ్డారు. ప్రతి ఇంటిపైన సోలార్ వ్యవస్థ ఏర్పాటు కావాలని, ఇదే ముఖ్యమంత్రి లక్ష్య మన్నారు. పులివెందులలో చాలా చోట్ల రోడ్లు దెబ్బతిన్నాయని, రోడ్లు ఏర్పాటు చేయాలని ప్రజలు అడుగుతున్నారని తెలుపగా.. పులివెందుల మున్సిపల్ కమిషనర్ రాముడు మాట్లాడుతూ మున్సిపాలిటీలో నిధుల లభ్యత తక్కువగా ఉందని, నిధులు ఉన్న మేరకు రోడ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈసందర్భంగా పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి పులివెందుల ప్రాంత రైతులకు వీలైనంత ఎక్కువ శాతం డ్రిప్పు పరికరాలు అందేలా చూడాలని మంత్రిని కోరారు. పులి వెందుల మున్సిపల్ కమిషనర్ రాముడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ విజయభాస్కర్, జిల్లా ఉద్యానశాఖ అధికారి సుభాషిణి, వ్యవసాయశాఖ జేడీ నాగేశ్వర్‌రావు, ఆర్డీఓ చెన్నయ్య, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో తనిఖీ

వచ్చే విద్యా సంవత్సరం నుంచే తొండూరు మహాత్మాగాంధీ పూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల బాలికల సంక్షేమ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలల్లో తరగతులు ప్రారంభిస్తామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత పేర్కొన్నారు. మంగళవారం మంత్రి తొండూరు సమీపంలో నిర్మాణ పనులు ఆగిపోయిన గురుకుల పాఠశాలను కలెక్టర్ చెరు కూరి శ్రీధర్‌తో కలిసి మంత్రి తనిఖీ చేశారు. తరగతి గదులను, హాస్టల్ గదులను, కిచెన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి విలేకరులతో మాట్లాడుతూ 2018లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ పాఠశాలను మంజూరు చేశారన్నారు. నా బడుగులు, నా బలహీనవర్గాలు అని చెప్పుకొంటూ ఐదేళ్ల కాలం గడిపిన ముఖ్య మంత్రి జగన్ ఈ పాఠశాలను పూర్తి చేయడంలో నిర్లక్ష్యం చూపారన్నారు. ఈ భవన నిర్మాణాకి రూ.10కోట్ల నిధులు సమకూర్చి వచ్చే విద్యాసంవత్సరం నుంచి తరగతులు ప్రారంభిస్తామన్నారు. అనంతరం తొండూరు ఐటీఐ కళాశాలను పరిశీలించారు. ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి, శివమోహన్‌రెడ్డి, టీడీపీ నేతలు పాల్గొన్నారు.



పులివెందులలో అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి సవిత

ఆర్టీపీపీలో ఆక్టోపస్ మాక్ డ్రిల్



ఎర్రగుంట్ల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఆర్టీపీపీలోని ప్రధాన ప్లాంట్‌లో రాష్ట్ర ఆక్టోపస్ టీం మంగళవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. ఉగ్రవాదులు, ఇతర ప్రమాదకర వ్యక్తుల నుంచి ఆపదలొచ్చిన సమయంలో ఆక్టోపస్ అటాకింగ్ ఎలా ఉంటుందో డెమో టెస్ట్ చేసి చూపించారు. ఆక్టోపస్ అడిషనల్ ఎస్పీ రాజారెడ్డి ఆధ్వర్యంలో 42మందితో కూడిన ఆక్టోపస్ టీం మాక్ డ్రిల్ చేశారు. ఉగ్రవాదులు ప్లాంట్లలో చొరబడినప్పుడు ఆక్టోపస్ వేగంగా ఎలా స్పందిస్తుందో చేసి చూపించారు. అధు నాతన ఆయుధాలు, ట్రైనీ డాక్స్, సేఫ్టీ పరికరాలతో వారు ప్లాంటులో డెమో ఇచ్చారు. మంగళవారం ఉదయం కొండాపురం సీఐ రఫి, స్థానిక రెవెన్యూ అధికారులు, వైద్యాధికారులు, ఇతర అధికారులతో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

డీఈఓ వెబ్‌సైట్‌లో స్కూల్ అసిస్టెంట్‌ల సీనియారిటీ జాబితా

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): జోన్-4 పరిధిలోని అనంతపురం, చిత్తూరు, కడప, కర్నూలు పూర్వపు జిల్లాలోని స్కూల్ అసిస్టెంట్ (గవర్నమెంట్) నుంచి గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయ పోస్టు పదోన్నతులకు సంబంధించి సీనియారిటీ జాబితా ఆర్జేడీ వెబ్‌సైట్‌లో ఉన్నట్లు ఆర్జేడీ కె.శామ్యూల్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యంతరాలు ఉంటే ఈనెల 11వ తేదీ లోపు ఆధారాలతో సంబంధిత డీఈఓ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు.

బండలాగుడు పోటీలు



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ప్రొద్దుటూరు రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): గోపవరం పంచాయతీ పరిధిలోని ద్వారకానగర్‌లో మంగళవారం కోదండరామస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన ఎద్దుల బండలాగుడు పోటీలను ఎమ్మెల్యే నంద్యాల వరద రాజులరెడ్డి ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 9 కాడెలు ఈ పోటీల్లో పాల్గొని తమ సత్తాను చాటుకున్నాయి. కొత్తపల్లె పంచాయతీ సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి, మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, బచ్చల వీరప్రతాప్, ద్వార్శల గురివిరెడ్డి పాల్గొన్నారు.

గ్రంథాలయ సెస్‌ను గ్రంథాలయాలకే ఉపయోగించాలి



మాట్లాడుతున్న వల్లూరు శివప్రసాద్

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాల అభివృద్ధికి గ్రంథాలయ సెస్‌ను ఉపయోగించి.. వాటి ప్రగతికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆంధ్రప్ర దేశ్ రాష్ట్ర పునర్వికాస ఉద్యమ వేదిక కన్వీ నర్ వల్లూరు శివప్రసాద్ కోరారు. మంగళ వారం కడప నగరం సీపీ బ్రౌన్ గ్రంథాలయంలో అభ్యుదయ రచయితల సంఘం, ఇంటాక్ కడప చాప్టర్ సంయుక్త ఆధ్వ ర్యంలో గ్రంథాలయోద్యమ పునర్వికాస ఉద్యమ వేదిక సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వల్లూరు శివప్రసాద్ మాట్లాడుతూ 1960లో ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ లైబ్ర రీ యాక్ట్ ప్రకారం ప్రజలు కట్టే పన్నుల్లో 8శాతం గ్రంథాలయ సెస్ ఉందని, ఆ నిధులను గ్రంథాలయాల ప్రగతికి ఉపయోగించాలని కోరారు. పదేళ్ల కాలంలో రూ.350 కోట్లకు పైగా గ్రంథాలయాల సెస్సు ప్రభుత్వం వసూలు చేసిందని, అందులో కేవలం రూ.20కోట్లకు మించి ఖర్చు చేయలేదని విశ్లేషించారు. సిబ్బంది కొరత, భవనల లేమి, కొత్తపుస్తకాలు కొనుగోలు చేయలేకపోవడం వంటి సమస్యలతో సతమతమవుతున్నాయని తెలిపారు. ప్రతి జిల్లాలోను గ్రంథాలయ పునర్వి కాసుద్యమ వేదిక సభలు నిర్వహిం చిన అనంతరం 27వ తేదీన రాష్ట్రస్థాయి సదస్సును రచయితలు, గ్రంథాలయ అభిమానులు, సాహితీవేత్తలతో నిర్వహించను న్నామని తెలిపారు. కడప జిల్లా అధ్యక్షుడు ఆచార్య ఎన్.ఈశ్వర్‌రెడ్డి, ఇంటాక్ జాతీయ పాలక మండలి సభ్యులు లయన్ కె.చిన్నపరెడ్డి, ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం కడప జిల్లాశాఖ అధ్యక్షుడు జాన మద్ది విజయభాస్కర్, సీపీ బ్రౌన్ గ్రంథాలయ సంచా లకులు ఆచార్య జి.పార్వతి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మైదుకూరు రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మంగారిమఠం మండలం కొత్త బసవాపురం గ్రామానికి చెందిన కె.శ్రీకాంత్(22) మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. శ్రీకాంత్ స్కూటీపై బ్రహ్మంగారిమఠం నుంచి మైదుకూరు వైపునకు వస్తుండగా, మైదుకూరు మండలం వనిపెంట సమీపంలో మైదుకూరు నుంచి పోరుమామిళ్ల వైపు అతివేగంగా వెళుతున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రగా యాలైన శ్రీకాంత్‌ను కర్నూలు ఆసుపత్రికి తరలిస్తుండగా నంద్యాల వద్ద మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పసుపు యార్డులో వసతులు కల్పించాలి

● మర్చంట్ అసోసియేషన్ డిమాండ్

కడప రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కడప పసుపు మార్కెట్ యార్డులో రైతులు తీసుకువచ్చే పంట ఉత్తత్తులకు సౌకర్యాలకు కల్పించాలని కడప మర్చంట్ అసోసియేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు రామక్రిష్ణారెడ్డి, జవహర్‌లాల్ చౌదరిలు డిమాండ్ చేశారు. మంగళవారం మార్కెట్‌యార్డులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పసుపు మార్కెట్ యార్డులో ఇటీవల కురిసిన వర్షానికి దాదాపు 1500 నుంచి 2000ల పసుపు బస్తాలు వర్షపు నీటిలో మునిగిపోయాయన్నారు. రైతులు తమ ఉత్పత్తులను ఉంచుకోవానికి తగిన షెడ్లు లేకపోవడంతో ఇలా జరిగిందన్నారు. ప్రస్తుతం పసుపు విక్రయాలు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. కానీ రైతులు తీసుకువచ్చే పంట ఉత్పత్తులకు యార్డులో తగిన మౌలిక వసతులు లేకపోవడంతో అటు రైతులు, ఇటు వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ముఖ్యంగా మార్కెట్ యార్డులో సక్రమంగా రోడ్లు, డ్రైనేజీ కాలువలు లేకపోవడంతో వర్షపు నీరంతా యార్డులోనే రోజుల తరబడి నిలుస్తోందన్నారు. ఇక రైతులకు విశ్రాంతి భవనాలు, మంచినీటి సదుపాయం, మరుగుదొడ్ల సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పసుపు మార్కెట్‌యార్డులో 35 వరకు గిడ్డంగులు ఉన్నాయని.. ఒక్కో గిడ్డంగి నుంచి కార్పొరేషన్ శాఖకు పన్నుల రూపంలో ఏడాదికి రూ.40వేలు చెల్లిస్తున్నామని.. అయితే ఇక్కడ సౌకర్యాలు కల్పించడంలో అధికారులు శ్రద్ధ చూపడం లేదన్నారు. ఇప్పటికైనా స్పందించి పసుపు యార్డులో రైతులకు అవసరమైన మౌలిక వసతులను కల్పించాలని కోరారు. కడప మర్చంట్ అసోసియేషన్ సెక్రటరీ జీవీ రాఘవులు, జాయింట్ సెక్రటరీ నరసింహులు, కోశాధికారి గుర్రంకొండ మహేష్, సభ్యులు పాల్గొన్నారు.

ఏపీజీబీ తరలింపు మానుకోవాలి



ఆర్సీపీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద చేస్తున్న నిరసన

కడపసెవెన్ రోడ్స్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): బ్యాంకుల విలీనం చేస్తూ ఆర్బీఐ ఇచ్చిన నోటిఫికేషన్ నిరసిస్తూ రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం కడప కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి రవిశంకరెడ్డి మాట్లాడుతూ దేశంలోని అతిపెద్ద రూరల్ బ్యాంక్ అయిన ఏపీజీబీ ప్రధాన కార్యాలయం కడప నుంచి అమరావతికి తరలించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయ రాయలసీమకు శరాఘాతం అని మండిపడ్డారు. ముఖ్యమంత్రి మైదుకూరుసభలో ఏపీజీబీ తరలింపు ఉండదు అని స్పష్టమైన హామీ ఇచ్చి ఇంత అన్యాయం చేయడం ఘోరమని దుయ్యబట్టారు. ఇది రాయలసీమకు తీరని అన్యాయమన్నారు. రాష్ట్రంలోని నాలుగు బ్యాంకులు విలీనం చేస్తూ ఒకే బ్యాంకుగా నిర్ణయించిన కేంద్ర ప్రభుత్వం ప్రధాన కార్యాలయాన్ని కడపలో ఉండడానికి కావాల్సిన నిబంధనలు ఉన్నా కడప నుంచి ఏపీజీబీ ప్రధాన కార్యాలయం అమరావతికి తరలించాలన్న నిర్ణయం సరికాదన్నారు. ఆర్సీపీ నగర కారదర్శి మక్బూల్ బాష, తస్లీమ్ తదితరులు పాల్గొన్నారు. కాగా, రాయలసీమ ప్రయోజనాలను బలిపెట్టి 2025 మే 1 నుంచి రాష్ట్రస్థాయి గ్రామీణ బ్యాంకును ఏర్పాటు చేస్తూ.. దాని ప్రధాన కార్యాలయాన్ని అమరావతిలో ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం ఏప్రిల్ 7న గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడం దుర్మార్గమని రాయలసీమ ఆకాంక్షల పౌర వేదిక కోఆర్డినేటర్ అలవలపాటి రఘునాథరెడ్డి ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలి

● మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

చిన్నమండెం, ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. మంగళవారం చిన్నమండెం మండలం బోరెడ్డిగారిపల్లెలో తమ నివాసంలో మంత్రి ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రా ష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తామన్నారు.హౌసింగ్ పథకం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ రూరల్ ప్రాంతంలో మూడు సెంట్లు, మున్సిపల్ పరిధిలో రెండు సెం ట్లు ఇంటి స్థలం మంజూరు చేసి ఇంటి నిర్మాణానికి రూ.4లక్షల సహాయం అందజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.



ప్రజాదర్బార్‌లో ప్రజల సమస్యలు వింటున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

క్రికెట్ అకాడమీని ప్రారంభించిన మంత్రి

రాయచోటిటౌన్, ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మంగళవారం రాయచోటి పట్టణంలోని గాలివీడు రింగు రోడ్డు సర్కిల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన కేఈఆర్ క్రికెట్ అకాడమీని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యపైనే కాకుండా క్రీడల్లో కూడా రాణించి మంచి క్రీడాకారులుగా ఎదగాలన్నారు. ప్రస్తుత వేసవి సెలవుల్లో రాయచోటి పట్టణంలో కేఈఆర్ క్రికెట్ అకాడమీ ఏర్పాటు చేయడం ఎంతో శుభ పరిణామమన్నారు. ప్రభుత్వం క్రీడాకారులకు విద్య, ఉద్యోగాల్లో మొదటి ప్రాధాన్యత ఇస్తోందన్నారు.

మండిపల్లి నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్‌తో సేవా కార్యక్రమాలు

సంబేపల్లె, ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): తమ తండ్రి మండిపల్లి నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్‌తో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా సంబేపల్లె పాఠశాల ప్రవేశ ద్వారానికి గేటు, ఆర్చ్‌ని ఏర్పాటు చేశామని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి ప్రారంభించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి ఉపాధ్యాయ బృందంతో విద్యార్థులతో కలిసి ఆయనకు పుష్పగుచ్ఛంతో ఘనస్వాగతం పలికారు. తహసీల్దార్ సుబ్రమణ్యంరెడ్డి, ఎంపీడీవో రామచంద్ర, టీడీపీ నాయకులు గాజుల ఖాదర్‌బాషా, మదన్‌మోహన్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, కోటేశ్వర్‌రెడ్డి, మల్లు విష్ణువర్ధన్‌రెడ్డి, నూరెకరాల రంగారెడ్డి, వేణుగోపాల్‌నాయుడు, రేవన శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సురక్షితంగా గమ్య స్థానం చేర్చడమే ఆర్టీసీ లక్ష్యం

రాయచోటిటౌన్, ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి):ప్రయాణికులను సురక్షితంగా గమ్యం చేర్చడమే ఆర్టీసీ ఉద్దేశ్యమని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన రాయచోటి పట్టణంలోని శివాలయం సెంటర్‌లో 12 నూతన ఆర్టీసీ బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి మాట్లాడుతూ ప్రస్తుతం ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని 3 సూపర్ డీలక్స్‌లు, 2 అల్ట్రాడీలక్స్‌లు, 5 ఎక్స్‌ప్రెస్‌లు, 2 పల్లె వెలుగు బస్సులను ప్రారంభించామన్నారు. ఐదేళ్లలో ఏపీఎస్ ఆర్టీసీ పూర్తి నిర్వీర్యం అయ్యిందన్నారు.ప్రయాణికులకు నాణ్యమైన రవాణా సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

బతుకు జీవుడా..

జలం జీవాధారం.. జీవకోటికది ప్రాణాధారం.. ఆహారం లేకున్నా కొంత సేపు ఉండగలమేమోగాని నీళ్లు లేకపోతే ఉండలేం.. గొంతెండిపోతుంది.. నాలుక పిడచకట్టుకుపోతుంది. ఇంకా ఆలస్యమై శరీరమంతా తడారిపోతే ప్రాణాలకే ముప్పు ఏర్పడుతుంది. ప్రస్తుతం వేసవి కాలం అయినందున మనుషులే కాదు.. జంతువులు, పశుపక్ష్యాదులు సైతం నీటి కోసం ఎంత తహతహలాడిపోతాయో రైల్వేకోడూరు పట్టణంలోని ఈ చిత్రాలే నిదర్శనం.

- రైల్వేకోడూరు, (ఆంధ్రజ్యోతి)



నీటి తొట్లను పరిశీలించిన కలెక్టర్

వీరబల్లి, ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): మండలంలోని సంఘంవారిపల్లె, మట్లి గ్రామాల్లో నూతనంగా నిర్మించిన పశువుల తొట్టులను మంగళవారం కలెక్టర్ చామకూరి శ్రీధర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో పశువుల దాహార్తిని తీర్చడానికి గ్రామాల్లో నీటి తొట్టెల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఎక్కడ కూడా నీరు లేక పశువులు ఇబ్బందులు ప డరాదని అధికారులకు సూచించారు. నీటి సంరక్షణ చర్యలు చేపట్టి భూగర్భజలాల వృద్ధికి కూడా ప్రభుత్వం విశేష కృషి చేస్తోందన్నారు.ఇందులో భాగంగా గ్రామాల్లో సేద్యపు నీటికుంట, ఫారంపాండ్లను కూడా విస్తృతంగా మంజూరు చేస్తామ న్నారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సంఘంవారిపల్లెలో నీటి తొట్టిని పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్

కార్మికుల సమస్యలపై సంతకాల సేకరణ

రాజంపేట టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మున్సిపాలిటిలో సమస్యలపై మున్సిపల్ కార్మికులు మంగళవారం సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. మంగళవారం ఆప్కాస్ రద్దు చేసి కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని కోరుతూ మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మిక సంఘాల నేతల ఆధ్వర్యంలో కార్మికులు రాష్ట్ర మున్సిపల్ శాఖమంత్రికి కోరారు. వారికి మద్దతుగా ప్రజల నుంచి సంతకాలు సేకరించి రాష్ట్ర ప్రభుత్వానికి ఈ నెల 10న రాష్ట్రవ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీల్లో సంతకాలు సేకరించి పంపుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పీవీ రమణ, జిల్లా కోశాధికారి లక్ష్మీదేవి, మున్సిపల్ యూనియన్ రాజంపేట నాయకులు బాలాజీ, సాలమ్మ, ప్రమీల, రమణ పాల్గొన్నారు.

'వంట గ్యాస్ ధర పెంచడం సరికాదు'

రాయచోటిటౌన్, ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): గృహ వినియోగదారులు ఉపయోగించే గ్యాస్ సిలిండర్ ధర పెంచడం అమానుషమని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్న సామాన్యుడిపై మూలిగేనక్కపై తాటికాయ పడ్డట్టు సిలిండర్ రేటు పెంచడం భారం మోపినట్టన్నారు.

మాతమ్మ గుడికి స్థలం కేటాయించండి



సబ్‌కలెక్టర్ నిదియాదేవికి వినతిపత్రం అందజేస్తున్న మహిళలు

రాజంపేట టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట మండల పరిధిలోని అత్తిరాలలో మాతమ్మ గుడికి స్థలం కేటాయించాలని మంగళవారం సబ్‌కలెక్టర్ వైఖోం నిదియాదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ గుడి నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని వారు కోరారు. అందుకు సబ్‌కలెక్టర్ స్పందిస్తూ స్థల పరిశీలన చేసిన తర్వాత నిర్ణయం తీసుకుంటామన్నారు.

మైనర్లు వాహనాలు నడపడం నేరం

ఓబులవారిపల్లె, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఇచ్చిన నిబంధనలు సూచనలు మేరకు ప్రజలు నడుచుకోవాలని ఎస్‌ఐ మహేష్ తెలిపారు. ఆటో, జీపు, ద్విచక్ర నడిపే వ్యక్తులు కచ్చితంగా డ్రైవింగ్ లైసెన్సు, వాహన రికార్డులు అన్ని సక్రమంగా ఉంచుకోవాలని, లైసెన్సు లేకుండా వాహనం నడిపితే సదరు వాహనం యజమానిపై కూడా కేసు నమోదు చేయడం జరుగుతుందన్నారు. మైనర్‌లు వాహనాలు నడిపితే వారితో పాటు మైనర్‌కు వాహనం ఇచ్చిన వారిపై కేసు నమోదు చేస్తారన్నారు. ప్రమాదాల నివారణకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు ప్రతిఒక్కరూ పాటించాలని ఎస్‌ఐ మహేష్ సూచించారు.

పక్కా గృహాలను క్రమబద్ధీకరించేందుకు అనుమతి

రాయచోటి(కలెక్టరేట్),ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): రాయచోటి మండలంలో అనుమతి లేకుండా ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారి గృహాలను క్రమబద్ధీకరిస్తూ ప్రభుత్వం జీవోను విడుదల చేసిందని రాయచోటి ఆర్డీవో ఏ.శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 29-1-2025 జీవో 30 ప్రకారం 150 స్క్వేర్ ఫీట్స్‌లో బీపీఎల్/ఏపీఎల్ ఉన్న గృహాలకు ఉచితంగా మార్కెట్ వ్యాల్యూ ప్రకారం క్రమబద్ధీకరించే అవకాశం ఉందన్నారు. కావున రాయచో టి పట్టణంలో ఉన్న ప్రజలు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు తెలిపారు. పూర్తి వివరాలకు వారి పరిధిలో ఉన్న సచివాలయాలను సంప్రదించాలని ఆయన కోరారు.



శ్రీనివాస్, ఆర్డీవో, రాయచోటి

సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం

రామాపురం, ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): పేదవానికి సొంత ఇంటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని తహసీల్దార్ రామాంజనేయులు అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సొంత స్థలం లేక ప్రభుత్వ స్థలంలో ఇళ్లు నిర్మించుకున్న పేదవానికి ప్రభుత్వం ఆ స్థలానికి డీ-ఫారం ఇవ్వడానికి జీవో ఇచ్చిందన్నారు. బీపీఎల్ కింద ఉన్న వారు, గ్రామీణ ప్రాంతాల్లో నెలకు రూ.10 వేల లోపు ఆదాయం గల వారు అర్హులన్నారు. 2019 అక్టోబరు 15 నాటికి ఇళ్లు నిర్మించుకున్న వారు కరెంటు బిల్లు, ఆధార్ కార్డులు, రేషన్‌కార్డు, లబ్ధిదారుల మూడు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఇంటి ఫోటోతో వీఆర్‌వోకు ఇవ్వాలన్నారు.

గృహ నిర్మాణాలను క్రమబద్ధీకరిస్తాం

సంబేపల్లె, ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూముల్లో 15-10-2019 లోపు నిర్మించిన గృహ నిర్మాణాలను క్రమబద్ధీకరిస్తామని తహసీల్దార్ సుబ్రమణ్యంరెడ్డి తెలిపారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆర్డీవో ఆదేశాల మేరకు జీవో నెంబర్ 30 ప్రకారం ప్రభుత్వ భూముల్లో నిర్మించిన గృహాలకు క్రమబద్ధీకరిస్తామని తెలియజేశారు.

ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ

గాలివీడు, ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అభ్యంతరం లేని ప్రభుత్వ భూములను క్రమబద్ధీకరిస్తున్నట్లు తహసీల్దార్ భాగ్యలత తెలిపారు. జీవో నెంబర్ 30ను అనుసరించి ల్యాండ్ రెగ్యులైజేషన్ స్కీం 2025 ప్రకారం పట్టాలను మహిళల పేరుపై జారీ చేయనున్నట్లు తెలిపారు.

ఇళ్లు, అసైన్మెంట్ భూములకు దరఖాస్తు చేసుకోండి

లక్కిరెడ్డిపల్లె, ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): నిరుపేదలు ఇళ్లు, అసైన్మెంట్ భూములకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా గ్రామ సచివాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు.

కూటమి ప్రభుత్వంలో ప్రతి పల్లె ప్రగతి పథం

చిట్వేలి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్ర భుత్వం నేతృత్వంలో ప్రతిపల్లె ప్రగతి పథంలో పరుగులు పెడుతుందని నియోజకవర్గ ఎ మ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్, ముక్కా సాయివికాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం మం డలంలో జరిగిన పలు ప్రారంభోత్సవాలకు రైల్వేకోడూరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్, నియోజకవర్గ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి తనయులు సాయివికాస్‌రెడ్డి పాల్గొన్నారు. నాగవరం పంచాయతీలో వడ్డిపల్లె, దేవుని నాగవరం, ఉప్పరపల్లె, చొప్పావారిపల్లె గ్రామాల్లో సీసీ రోడ్లను ప్రారంభించారు. అలాగే నేతివారి పల్లె గ్రామ సచివాలయం ప్రారంభించారు. మార్గిపల్లె పంచాయతీ కేంద్రంలో నిర్మించిన ఆరోగ్య కేంద్రం, రైతు సేవ కేంద్రాలను ప్రారంభించారు. సీనియర్ నాయకులు లారీ సుబ్బరాయుడు, బాలు రామాంజనేయులు, జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, గుత్తి నరసింహా, గుండాల యాదవ్, మాదాసు నరసింహా, రవికుమార్‌రాజు, పెంచల్‌రెడ్డి, రాజా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



రిబ్బన్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్

రైతు సేవా కేంద్రం ఆకస్మిక తనిఖీ

సిద్దవటం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఉప్పరపల్లె, బొగిడివారిపల్లె గ్రామాల్లో రైతు సేవా కేంద్రాలను మంగళవారం వ్యవసాయ సంచాలకులు నాగరాజు ఆకస్మిక తనిఖీ చేసి సిబ్బంది వివరాలు, రిజిస్టర్‌లు పరిశీలించారు. సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని రైతు సేవా కేంద్రాల్లో రైతులకు అందుబాటులో ఉండి రైతుల పంటలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సలహాలు, సూచనలు అందించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా సహాయ వ్యవసాయ సంచాలకులు మాట్లాడుతూ సిబ్బంది విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి రైతుల పంటల పట్ల రైతులకు సూచనలు అందించాలని, క్షేత్ర పర్యటన చేసి రైతుల సందేహాలను తెలుసుకోవాలన్నారు. రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య జారీ ప్రక్రియ తనిఖీ చేశారు. సొంత భూమి కలిగిన వారంతా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.



ఉప్పరపల్లె రైతుసేవా కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న నాగరాజు

నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు కృషి చేయాలి

నందలూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : ఆటిజం ఉన్న పిల్లల్లో సామాజిక నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు కృషి చేయాలని సైకాలజిస్టులు డాక్టర్ ఉదయ్‌కిరణ్, రాధికా అన్నారు. మంగళవారం ప్రభుత్వ వైద్యులు శరత్ కమల్, కార్తీక్ విశ్వనాద్ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి బస్టాండు కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. సైకాలజిస్టులు మాట్లాడుతూ ఆటిజం లక్షణాలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ సునీల్, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

హౌసింగ్ గిడ్డంగిని తనిఖీ చేసిన విజిలెన్స్ అధికారి

పెనగలూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : హౌసింగ్ కార్పొరేషన్ వస్తువులను నిల్వ చేసే గిడ్డంగిని మంగళవారం హౌసింగ్ కార్పొరేషన్ విజిలెన్స్ అధికారి మురళీకృష్ణ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గిడ్డంగిలో నిల్వ ఉన్న సిమెంటు, స్టీలు ఆయన తనిఖీ చేశారు. అలాగే లబ్ధిదారులకు సరకులు పంపిణీ చేసి స్టాక్ రిజిస్టర్‌ను కూడా పరిశీలించారు. రెండు చోట్ల ఒకేవిధమైన నంబరు కనిపించడంతో ఆయన సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మండల హౌసింగ్ కార్పొరేషన్ ఏఈ హరిప్రసాద్ ఉన్నారు.

సీతారాముల కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే

పెనగలూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : పెనగలూరు మండంలోని నర్సింగరాజపురం దళితవాడలో సోమవారం రాత్రి జరిగిన సీతారాముల కల్యాణోత్సవంలో రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, నియోజకవర్గ టీడీపీ నాయకురాలు ముక్కా వరలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు సీతారామ లక్ష్మణ ఆంజనేయుల మూల మూర్తులకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం కల్యాణోత్సవంలో పాల్గొని శ్రీవారి దంపతుల ఆశీస్సులు తీసుకున్నారు. ప్రతి ఒక్కరూ సుఖఃశాంతులతో జీవించాలని కోరుకున్నారు. వారి వెంట ఎస్.ఆర్.పురం బూత్ కమిటీ కన్వీనర్ కాకి శ్రీరాం, టీడీపీ నాయకులు కత్తి సుబ్బరాయుడు, తాళ్ల సుబ్బరాయుడు, డీసీసీ బ్యాంకు మాజీ డైరెక్టర్ లేబాక శ్రీనివాసరెడ్డి, బత్తిన వేణుగోపాల్ రెడ్డి, బీఎల్ నరసింహారెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయండి

● కాంగ్రెస్ శ్రేణులకు డీసీసీ అధ్యక్షుడు గాజుల భాస్కర్ పిలుపు

రాయచోటిటౌన్, ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయాలని ఆ పార్టీ శ్రేణులకు అన్నమయ్య జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజుల భాస్కర్ జిల్లా మహిళా అధ్యక్షురాలు, జిల్లా ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులకు పిలుపునిచ్చారు. మంగళవారం రాయచోటి పట్టణంలోని కాం గ్రెస్ పార్టీ కార్యాలయంలో అన్ని శాఖలకు సంబంధించి నామినేటెడ్ పదవుల నియామకపు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎంపీటీసీ, జెడ్పీటీసీ,మున్సిపాలిటీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా దూసుకెళ్లాలన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా సుండుపల్లె మండలానికి సంబంధించిన 20 కుటుంబాలు వైసీపీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ చీఫ్ సెక్రటర అమీర్, సీనియర్ నాయకులు సింగం రామక్రిష్ణారెడ్డి, మహిళా అధ్యక్షురాలు నిగర్‌సుల్తానా, లీగల్ సెల్ అధ్యక్షుడు తొట్లి వెంకట్రమణారెడ్డి, రాయచోటి పట్టణ అధ్యక్షులు బాబాసర్ధార్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఖాదర్‌ఖాన్, జిల్లా అధికార ప్రతినిధి మన్సూర్ అలీఖాన్, పట్టణ మహిళా అధ్యక్షురాలు వనజారెడ్డి, నూతనంగా ఎంపిక కాబడిన కార్యదర్శులు, కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



నియామక పత్రాలు అందజేస్తున్న డీసీసీ అధ్యక్షుడు గాజుల భాస్కర్

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

సుండుపల్లె, ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలని ఆర్‌హెచ్‌జీబీఎంఎస్‌ఎస్ సంస్థ ప్రతినిధి రత్నం తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని స్త్రీనిధి భవనంలో పొదుపు సంఘాల మహిళలు, స్థానికులకు ఖాతాదారుల అవగాహన, చైతన్య పథకంపైన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలు ఎక్కువైపోతున్నాయని, ఫేస్‌బుక్, వాట్సాప్ ఇతర ప్రసార మాధ్యమాల్లో వచ్చే అనధికారిక సందేశాలను చూడకూడదని, ఫోన్ కాల్స్ ద్వారా ఓటీపీలు ఇతర సాచారం అడిగితే ఇవ్వకూడదని తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో సీసీ శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి: ఏఐటీయూసీ

ఓబులవారిపల్లె, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముక్కావారిపల్లె, ఓబులవారిపల్లె, వై.కోట, ఆశా కార్యకర్తలతో కలిసి మెడికల్ ఆఫీసర్‌కు ఏఐటీయూసీ కార్మిక సంఘం తరపున వినతిపత్రం సమర్పించడం జరిగిందని జిల్లా అధ్యక్షులు గంగాధర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఆశా కార్యకర్తలకు ఇచ్చిన హామీలను చిత్తశుద్ధితో జీవోలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఇందులో ఆశా వర్కర్స్‌కు గౌరవ వేతనం 26 వేలకు పెంచాలని, ఆశాలకు సంబంధం లేని ఆన్‌లైన్ పనులు చేయించరాదని, పనిభారాన్ని తగ్గించాలన్నారు. ప్రభుత్వ సెలవులు, మెడికల్ లీవు, వేతనంతో కూడిన మెటర్నటి లీవు అమలయ్యేలా జీవోను విడుదల చేయాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఆశాలకు కూడా వర్తింపజేయాలన్నారు. కోవిడ్ కాలంలో మరణించిన ఆశా కుటుంబాలకు 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, కుటుంబంలో అర్హులైనవారిని ఆశాలుగా తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రూపు ఇన్సూరెన్స్, ఎన్‌హెచ్‌ఎం నిబంధనల ప్రకారం 1000-1200 జనాభాకుఒక ఆశావర్కర్ నియమించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వంటివి వర్తింపజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఓబులవారిపల్లె, ముక్కావారిపల్లె, వై.కోట, పీహెచ్‌సీ పరిధిలో ఉన్నటువంటి ఆశా కార్యకర్తలు హాజరయ్యారు.

ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు గంగాధర్, ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రాజశేఖర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు, ఆశా కార్యకర్తలు

సీఎం చంద్రబాబును కలిసిన సుగవాసి ప్రసాద్‌బాబు



ముఖ్యమంత్రి చంద్రబాబుతో సుగవాసి ప్రసాద్‌బాబు

రాయచోటిటౌన్, ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును మంగళవారం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. విజయవాడలోని సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి శుభాకాంక్షలు తెలియజేయడంతో పాటు పలు విషయాలపై చర్చించారు.

పాతాళానికి దోస ధరలు

- నష్టాల ఊబిలో రైతులు
- మొదట టన్ను రూ.22 వేలు
- ప్రస్తుతం రూ.4 వేలు

రైల్వేకోడూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): దోస పంటపై రైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అప్పులు తీరిపోతాయని ఆశపడ్డారు. ఉన్నపళంగా ధరలు పతనమయ్యాయి. వివరాల్లోకి వెళితే.... రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, చిట్వేలి, పెనగలూరు, పుల్లంపేట మండలాల్లో ఈ ఏడాది కుందన్, కోహినూర్ అనే రకాల దోసను రైతులు సాగు చేపట్టారు. పంట దిగుబడి ఆశించిన విధంగానే వచ్చింది. మొదటిగా టన్ను రూ. 22వేలు ధర పలికింది. ఉన్నపళంగా ధరలు టన్ను రూ.7వేలు, 6 వేలు వరకు తగ్గిపోయాయి. ప్రస్తుతం రూ.4వేలకు పడిపోయాయి. దీంతో కోసే వారు లేక రైతులు కాయలను చేలోనే వదిలేస్తున్నారు. ఈ సారి పండిన పంట రుచి, వాసన, రంగు, తీపి ఉంది. అయినా ధరలు మాత్రం లేవు. దీంతో పెట్టుబడి రాలేదని రైతులు దిగాలు చెందుతున్నారు. దోసతో కష్టాలు తీరిపోతాయని, అనుకున్న ధరలు రాలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లోడింగ్ చేసేందుకు టన్నుకు రూ.700 తీసివేస్తారు. టన్నుకు షూట్ ప్రకారంగా 50 కిలోల కాయలు తీసివేస్తారు. ప్రస్తుతం టన్ను రూ.5000 ఉండగా రైతుకు చేతికి వచ్చేది రూ.4000 మాత్రమే. మొదటి కోతకు మాత్రమే ఎక్కువ ధరలు ఉన్నాయి. రెండో కోతకు ధరలు లేవని వ్యాపారులు, దళారులు చెప్పడంతో కోతలు చాలా చోట్ల ఆగిపోయినాయి. రైతులు వ్యాపారుల దగ్గర నుంచి పెట్టుబడి తీసుకుని వచ్చి సాగుకు ఖర్చు చేశారు. అయితే ఆశించిన ధరలు లేకపోవడంతో వడ్డీలు పెరుగుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైల్వేకోడూరు మండలంలో 500 ఎకరాలు, ఓబులవారిపల్లె మండలంలో 400 ఎకరాలు, చిట్వేలి మండలంలో 300 ఎకరాలు, పుల్లంపేట మండలంలో 300 ఎకరాలు, పెనగలూరు మండలంలో 250 ఎకరాల్లో దోస సాగు చేసినట్లు తెలుస్తోంది. ఎకరా దోస సాగు ఖర్చు కూలీలు, దున్నకాలు, ఎరువులు, మల్చింగ్‌షీట్, మందులు తదితర వాటికి రూ. 80వేల నుంచి రూ.1లక్ష వరకు వస్తుందని రైతులు తెలిపారు. ఎకరాకు 200 గ్రాముల విత్తనాలు అవసరమని, కిలో విత్తనాలు రూ.54,000 అవుతుందన్నారు. రైల్వేకోడూరు నుంచి దోస కాయలను తమిళనాడు, విజయవాడ, హైద్రాబాద్, కేరళ, బెంగుళూరు తదితర ప్రాంతాలకు ఎగుమతి చేశారు. ప్రస్తుతం కోతలు జరగడం లేదు. స్థానికంగా రైతులు కోసి చిరు వ్యాపారులకు అమ్ముతున్నారు.


కోసేవారు లేక పొలంలోనే కుందన్ దోసకాయలు


కోసిన కాయలను లోడింగ్‌కు తీసుకెళ్తున్న కూలీలు

దోస రైతు అతలాకుతలం



పెట్టిన పెట్టుబడులు వస్తాయని ఆశించాం. పంట దిగుబడి బాగా వచ్చింది. లాభాలు వస్తాయని అనుకున్నాం. మొదటి కోతకు టన్నుకు రూ.22,000 వచ్చింది. రెండో కోత కు ధరలు పడిపోయాయి. రంజాన్ మాసంలో ఎక్కువగా డిమాండ్ ఉంటుందని అనుకున్నాం. అయితే ధరల ఇంత స్థాయిలో పడిపోతాయని అనుకోలేదు.

-జి.సురేష్‌రాజు, రైతు, అనంతరాజుపేట

పెట్టిన ఖర్చులు కూడా రాలేదు



పెట్టిన ఖర్చులు కూడా రాలేదు. దోసలో ఎక్కువగా లాభాలు వస్తాయని అనుకున్నాం. నియోజకవర్గ వ్యాప్తంగా రైతులు అందరూ దోస పంటను వేశారు. దళారులు రైతులను మోసం చేస్తున్నారు. ఈ వ్యవస్థ లేకుంటే చాలా వరకు రైతులు బాగుపడతారు.

- జి.వెంకటసుబ్బయ్య, రైతు, శింగిరివారిపల్లె

జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● జిల్లా మలేరియా నివారణ అధికారి రామచంద్రారెడ్డి


కార్తికేయనగర్‌లో మురికినీటి కుంటను పరిశీలిస్తున్న మలేరియా నివారణ అధికారి

సుండుపల్లె, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): జ్వరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నమయ్య జిల్లా మలేరియా నివారణ అధికారి రామచంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం సుండుపల్లె, రాయవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్లు, వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కీటక జనిత వ్యాధులు మలేరియా, డెంగ్యూ, ఫైలేరియా, చికెన్‌గునియా, మెదడు వాపు జ్వరాలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఫ్రైడే సర్వే, వెక్టార్ కంట్రోల్ యాప్‌ల ద్వారా మురికినీటి కాలువలు మురికి గుంటల్లో దోమల లార్వా వృద్ధి చెందకుండా ఉండుటకు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. జ్వరాలపైన ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం ఆసుపత్రిలోని రికార్డులను, ల్యాబ్ నిర్వహించే గదిని పరిశీలించారు. మండల కేంద్రంలోని కార్తికేయ నగర్‌లో ఇండ్ల మధ్యలో ఉండే మురికికుంటను పరిశీలించారు. ఈ విధంగా ఇండ్ల మధ్యలో మురికినీటి కుంటలు ఉండడం వలన దోమలు అధికమై రోగాల బారిన పడే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్‌యూనిట్ ఆఫీసర్ జయరామయ్య, డాక్టర్ ఫర్హాఖానం, రాయవరం వైద్యాధికారి శేఖర్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యామిత్ర స్టాక్ పాయింట్ సందర్శన

రాయచోటిటౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని నేతాజీ సర్కిల్‌లో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలను మంగళవారం రాష్ట్ర పరిశీలకుడు డాక్టర్ పెంచలయ్య సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు అవసరమైన 9 రకాల వస్తువులతో పాటు గిఫ్టులు ఇవ్వడానికి ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం రోజునే విద్యార్థులకు ఈ కిట్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. మండలానికి సంబంధించిన విద్యార్థులకు అందరికీ పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు, యూనిఫామ్, బ్యాగ్, షూసాక్స్, బెల్టులు మండల కేంద్రానికి నేరుగా చేరవేస్తామన్నారు. ఎంపికైన మండల స్టాక్ పాయింట్లు అనువుగా ఉన్నాయా లేదా అని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 14 నుంచి స్టాక్ పాయింట్లకు వస్తువులు ఒక్కొక్కటిగా చేరవేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రమణ్యం, జిల్లా ప్రత్యామ్నాయ పాఠశాలల సమన్వయ కర్త ఉలవల వెంకట్రామయ్య, మండల విద్యాశాఖ అధికారులు బాలాజీనాయక్, వెంకటశివారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ అలీ, సీఆర్పీలు పాల్గొన్నారు.

విశిష్ట సంఖ్య లేకుంటే రాయితీలు అందవు

● జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రానాయక్


వ్యవసాయశాఖ మండల అధికారులకు సూచనలిస్తున్న డీఏవో

మదనపల్లెటౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఫార్మర్ రిజిస్ట్రేషన్ నెంబర్ లేకుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీలు అందవని డీఏవో చంద్రానాయక్ తెలిపారు. మంగళవారం స్థానిక సీఎల్ఆర్సీ భవనంలో డివిజన్‌లోని ఏవోలు, ఏఈవోలతో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 1.78లక్షల మంది రైతులుండగా, 77 శాతం మంది రైతులు మాత్రమే విశిష్ట సంఖ్య నమోదు చేయించుకున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యం ప్రకారం 85 శాతం మంది రైతులు విశిష్ట సంఖ్య పొందితేనే రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతులం దరికీ రాయితీలు వర్తిస్తాయన్నారు. ముఖ్యంగా పీఎం కిసాన్ యోజన పథకం ద్వారా ఇప్పటికి 19 ఇన్‌స్టాల్‌మెంట్లు వచ్చాయని ఈ ఏడాది 20వ ఇన్‌స్టాల్‌మెంట్ వస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం రూ.6 వేలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.14 వేలు కలిపి మొత్తం రూ.20 వేలు కిసాన్ యోజన పథకం కింద అందుతుందన్నారు. విశిష్ట సంఖ్య పొందిన రైతులకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుందన్నారు. వ్యవసాయ యాంత్రీకరణ పథకానికి ప్రభుత్వం రూ.2.20 కోట్ల నిధులు మంజూరు చేస్తే ఇప్పటి వరకు రూ.1.20 కోట్లు మాత్రమే రైతులు వినియోగించుకున్నారన్నారు. రెండు సీజన్లతో వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో మూడో సీజన్‌లో కూడా సాగుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పిస్తోందన్నారు. దీనికి రైతులకు 50 శాతం రాయితీతో వేరుశనగ విత్తనాలు పంపిణీ చేసే అవకాశం ఉంటుందన్నారు. సమావేశంలో ఏడీఏ శివశంకర్, ఏవోలు పాల్గొన్నారు.

బస్సు ఢీకొని వృద్ధుడికి తీవ్రగాయాలు

రాజంపేటటౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రాజంపేట పాతబస్టాండులో స్థానిక డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మంగళవారం రాత్రి మీరావల్లి అనే వృద్ధుడిని ఢీకొంది. ఈ సంఘటనలో మీరావల్లి కాలికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు ఆయన్ను రాజంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యం

● మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి


సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

చిన్నమండెం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వండాడి గ్రామం గొర్లముదివేడు క్రాస్ నుంచి తూర్పుపల్లె వరకు కోటి రూపాయలతో నిర్మించిన నూతన తారు రోడ్డును మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోనే రాయచోటి నియోజకవర్గాన్ని ఆదర్శంగా అభివృద్ధి చేసి ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరిక నెరవేర్చడం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలోని రాయచోటి, సంబేపల్లె, గాలివీడు, లక్కిరెడ్డిపల్లె, రామాపురం, చిన్నమండెం 6 మండలాలకు రూ.450 కోట్లు ఖర్చు చేసి వెలిగల్లు ప్రాజెక్టు నుంచి నీటి సరఫరా చేసి మంచినీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు. వైసీపీ ప్రభుత్వంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి ఎటువంటి అభివృద్ధి పనులు చేయలేదని, కేవలం 9 నెలల కాలంలోనే రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రిని వంద నుంచి 150 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేశామన్నారు. త్వరలో రూ.350 కోట్లతో హంద్రీ-నీవా కాలువల ద్వారా ఈ ప్రాంతానికి సాగునీరు అందజేస్తామని తెలిపారు. రాబోయే రోజుల్లో ప్రతి గ్రామానికి సిమెంటు రోడ్లు, డ్రైనేజీ కాలువలు, వీధి లైట్లు, మంచినీటి సదుపాయం తదితర అన్ని మౌలిక వసతులు కల్పించి రాయచోటి నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా మంత్రికి వండాడి గ్రామ ప్రజలు గజమాలతో ఘనస్వాగతం పలికారు. అనంతరం పూజా కార్యక్రమాలు నిర్వహించి రిబ్బన్ కట్ చేసిన నూతన తారు రోడ్డును మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధిలో బీజేపీదే కీలకపాత్ర

● బీజేపీ రాష్ట్ర కోఆపరేటివ్ సెల్ కన్వీనర్ గోపాల్‌రెడ్డి

బి.కొత్తకోట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధిలో బీజేపీది కీలకపాత్ర అని ఆ పార్టీ కో ఆపరేటివ్ సెల్ రాష్ట్ర కన్వీనర్ ఎస్.గోపాల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం బి.కొత్తకోట మండలంలోని అమరనారాయణపురంలో తంబళ్లపల్లె నియోజకవర్గ స్థాయి క్రియాశీలక సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలను గ్రామీణ స్థాయి ప్రజల్లోకి ఎలా తీసుకువెళ్లాలనే విషయాలను వివరించారు. రాష్ట్ర గిరిజన మోర్చా కోకన్వీనర్ కావాడి రవీంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వం ఖర్చు చేస్తున్న నిధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్రంలో బీజేపీ భాగస్వామ్యంతో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉందని, ప్రతి మండలంలోనూ ప్రభుత్వ కార్యక్రమాలలో బీజేపీకి భాగస్వామ్యం ఉండేలా కార్యకర్తలు దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల కృష్ణమూర్తి, నాయకులు పిల్లాస్వామి, శోభ, శంకర్‌రెడ్డి, మండలకన్వీనర్లు జయరామిరెడ్డి, శ్రీకాంత్, వెంకట్రమణ, గుణశేఖర్, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు క్రమబద్ధీకరించుకోండి

● సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్

మదనపల్లెటౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబరు 30 ప్రకారం అభ్యంతరం లేని ఇళ్ల స్థలాలను క్రమబద్ధీకరించుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ సూచించారు. మంగళవారం స్థానిక సబ్‌కలెక్టరేట్ పీజీఆర్ఎస్ భవనంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2025 జనవరి 29న రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో 30 విడుదల ప్రకారం అభ్యంతరం లేని ప్రభుత్వ స్థలాలను క్రమబద్ధీకరించుకోవచ్చన్నారు. 2019 అక్టోబరు 15కు ముందు మహిళలు ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉండాలన్నారు. ఇటుకలు, మోల్డింగ్ లేదా రేకుల పైకప్పు తప్పనిసరిగా ఉండాలన్నారు. దీంతో పాటు ఆ ఇంటి పన్ను, విద్యుత్ మీటర్ బిల్లులు, కొళాయి పన్నులు లేదా రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ ఉండాలన్నారు. ఏడాదికి రూ.1.20 లక్షల లోపు ఆదాయం ఉండాలని, మూడు ఎకరాల మడి, లేదా 10 ఎకరాల చేను ఉండొచ్చన్నారు. ఆదాయపన్ను చెల్లించే వారు, నాలుగు చక్రాల వాహనం వున్న మహిళలు అనర్హులన్నారు. వీటితో పాటు దరఖాస్తు చేసుకునే మహిళ పేరుతో సొంత ఇళ్లు ఉండకూడదన్నారు. పై నిబంధనల మేరకు అర్హులైన వారు గ్రామ సచివాలయంలో, మీసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. బీపీఎల్ స్థాయిలో వున్న మహిళలకు 150 గజాల లోపు స్థలానికి ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయిస్తారని, 150 నుంచి 300 చదరపు గజాల లోపు స్థలం వుంటే స్థలం బేసిక్ ధరలో 15శాతం రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలన్నారు. 300 నుంచి 450 చదరపు గజాల స్థలం ఉంటే 50 శాతం రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలన్నారు. ఏపీఎల్ స్థాయి వారైతే 200 శాతం మార్కెట్ ధర చెల్లించి క్రమబద్ధీకరించుకోవచ్చన్నారు. ఈ అవకాశం 2025 డిసెంబరు 31 వరకు మాత్రమే ఉంటుందన్నారు. వివరాలకు ఆయా మండలాల తహసీల్దార్ కార్యాలయాల్లో తెలుసుకోవచ్చని సబ్‌కలెక్టర్ చెప్పారు.

రేపు విద్యుత్ లోక్‌అదాలత్


మాట్లాడుతున్న విద్యుత్ శాఖ ఈఈ రాజశేఖర్

రాజంపేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రాజంపేట డివిజనల్ విద్యుత్ కార్యాలయం నందు 10వ తేదీ గురువారం ప్రత్యేక విద్యుత్ అదాలత్ జరుగుతుందని ఈఈ ఎస్.రాజశేఖర్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ లోక్‌అదాలత్ చైర్‌పర్సన్ విశ్రాంత జడ్జి శ్రీనివాసు ఆంజనేయమూర్తి, ఆర్థిక సభ్యుడు కె.రామ్మోహన్‌రావు, సాంకేతిక సభ్యుడు అంజనికుమార్, స్వాతంత్ర్య సభ్యులు విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఈ అదాలత్ జరుగుతుందన్నారు. రాజంపేట పట్టణం రూరల్, పెనగలూరు, పుల్లంపేట, కోడూరు, చిట్వేలి, ఓబులవారిపల్లె నందలూరు మండలాల పరిధిలోని వినియోగదారులు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ విద్యుత్ సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. పదో తేదీ ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.

కవ్వింపు చర్యలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోండి

● వన్‌టౌన్ ఎస్‌ఐకి ఫిర్యాదు చేసిన వైసీపీ నేతలు

కడపక్రైం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కవ్వింపు చర్యలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని వైసీపీ నేతలు పోలీసులను కోరారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ మాజీ డిప్యూటీ సీఎం సోదరుడు అహ్మద్‌బాషాను బాంబేలో కడప పోలీసులు అరెస్టు చేశారంటూ వారి ఇంటి సమీపంలో టీడీపీ నేతలు బాణాసంచాను పేల్చడంతో పాటు స్వీట్లు పంచారని వైసీపీ నేతలు నాగయ్య, యానాదయ్యతో పాటు పలువురు కడప వన్‌టౌన్ ఎస్‌ఐ అమర్‌నాథరెడ్డికి మంగళవారం ఫిర్యాదు చేశారు. వీరిలో టీడీపీకి చెందిన సుబ్బారెడ్డి, యువరాజ్, పటాన్ ఖాజాపీర్, జియావుద్దీన్, రాజా, ఆరిఫ్, ఫైజల్ మరో రెండువందల మంది ఉన్నారని, నగరంలో పోలీసు 30 యాక్టు అమలులో ఉన్నా వారంతా కవ్వింపు చర్యలకు పాల్పడడం ఏమిటని ప్రశ్నించారు. వీరిపై కేసు నమోదు చేయాలని కోరారు.


ఎస్‌ఐ అమర్‌నాథరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న వైసీపీ నేతలు

ఉద్యానంతో ఉద్దీపనం

- ఉపాధి హామీ పథకంలో ఉద్యాన పంటలకు ప్రోత్సాహకాలు
- దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న రైతుల ఆర్థికాభివృద్ధే లక్ష్యం
- మామిడికి ప్రత్యామ్నాయాలపై దృష్టి

పీలేరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటల ద్వారా రైతుల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా 25 రకాల పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సాహకాలు అందిస్తోంది. గతంలో మామిడికే పరిమితమైన ఈ ప్రోత్సాహకాలను ప్రస్తుతం అనేక పంటలకు అందిస్తూ రైతుల్ని చైతన్యవంతుల్ని చేస్తోంది. తోటల సాగు పథకం ద్వారా గ్రామీణ కుటుంబాలకు ఉపాధి అవకాశాలు అందించడంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా స్థిరమైన తోటల సాగు విధానాలను ప్రోత్సహించడమే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. 0.25 ఎకరాల నుంచి 5 ఎకరాల వరకు పలు పండ్ల తోటలు సాగు చేసుకునే ఆసక్తి ఉన్న రైతుల్ని గుర్తించి వారిని చైతన్యవంతుల్ని చేయాలని ఉపాధి సిబ్బందిని ఆదేశించింది.


పీలేరులో మామిడి తోటలు


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏపీవో అశోక్ (ఫైల్)

ఎవరు అర్హులు

- షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలకు చెందిన రైతులు
- దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారు
- ఉపాధి హామీ కార్డు కలిగిన చిన్న, సన్నకారు రైతులు
- సంచార జాతులకు చెందినవారు
- డీ-నోటిఫైడ్ తెగలకు చెందినవారు
- భూసంస్కరణల లబ్ధిదారులు
- ప్రధాన మంత్రి ఆవాస యోజన లబ్ధిదారులు
- అటవీ నివాసులు
- ప్రత్యేక ప్రతిభావంతులు కలిగిన కుటుంబాలు
- మహిళల నేతృత్వం కలిగిన కుటుంబాలు

దరఖాస్తు చేసుకునే విధానం

ఆసక్తి గల రైతులు తమ గ్రామ ఫీల్డు అసిస్టెంటును గానీ, మండల కేంద్రాల్లో ఉండే ఉపాధి హామీ పథకం కార్యాలయంలో సంప్రదించాలి. జూన్ మాసం ఆఖరు వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. లబ్ధిదారులను గ్రామసభల ద్వారా ఎంపిక చేస్తారు. ఈ పథకం ద్వారా 2024-25 ఆర్థిక సంవత్సరంలో పీలేరు మండలంలో అధికారులు 129 మంది రైతుల ద్వారా 283 ఎకరాల్లో వివిధ పండ్ల తోటలను సాగు చేయించారు. 2025-25 సంవత్సరంలో 150 ఎకరాల్లో కొత్త తోటలు సాగు చేయించాలని అధికారులు నిర్ణయించారు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి



చిన్న, సన్న కారు రైతులు పండ్ల తోటల పెంపకం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. పండ్ల తోటల సాగుపై ఆసక్తి ఉన్నప్పటికీ ఆర్థిక స్తోమత లేని వారికి ఈ పథకం చక్కని అవకాశం. ఆసక్తి గల వారు వీలైనంత త్వరగా సంప్రదిస్తే వారికి కావాల్సిన సహకారం అందిస్తాం.

- అశోక్‌రెడ్డి, ఏపీవో, ఉపాధి హామీ పథకం

వివిధ పండ్ల తోటలు, మూడేళ్ల వరకు ఒక ఎకరాకు లభించే ప్రోత్సాహకాలు	
జాఫ్రా (సింధూరీ, లిప్‌స్టిక్ చెట్టు అనోటా అని కూడా పిలుస్తారు)	రూ.1,36,871
అవకాడో	రూ.1,16,254
సిల్వర్ ఓక్	రూ.1,52,295
పనస	రూ.67,163
ఆయిల్ పామ్	రూ.55,771
కకోవా (చాక్లెట్)	రూ.1,59,133
రబ్బర్ ప్లాంటేషన్	రూ.1,75,485
ఆపిల్ బేర్ (రేగు పండు)	రూ.1,26,186
రోజా పువ్వు	రూ.62,355
మల్లె పూలు	రూ.55,124
మునగ	రూ.27,515
మామిడి	రూ.1,09,950
జీడి పప్పు	రూ.98,684
స్వీట్ ఆరెంజ్	రూ.1,37,750
ఆసిడ్ లైమ్	రూ.1,46,311
జామ	రూ.1,46,311
తైవాన్ జామ	రూ.2,51,224
సపోట	రూ.95,584
కొబ్బరి	రూ.99,183
నేరేడు	రూ.68,163
చింత	రూ.68,403
సీతాఫలం	రూ.2,14,178
దానిమ్మ	రూ.2,16,417
అంజీర	రూ.1,67,324
డ్రాగన్ ఫ్రూట్	రూ.2,00,714

'ఓపి'క ఉండాల్సిందే...

● వేధిస్తున్న సర్వర్ సమస్య ● గంటల తరబడి నిరీక్షణ
● సర్వజన ఆసుపత్రిలో రోగులకు కష్టాలు

కడప సెవెన్ రోడ్స్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్) సమస్యలతో సతమతమవుతూనే ఉంది. రోజుకో సమస్యతో రోగులకు నరకయా తన చూపుతోంది. 2006లో ఆసుపత్రి ప్రారంభించినపుడు ఏర్పాటు చేసిన వ్యవస్థలతోనే నెట్టుకొస్తున్నారు. రోజురోజుకు వైద్యం కోసం వచ్చే రోగుల సంఖ్య పెరుగుతోంది. జిల్లా నలుమూలల నుంచే కాకుండా చుట్టుపక్కల జిల్లాల నుంచి సైతం రోగులు వైద్యం కోసం ఇక్కడకు వస్తుంటారు. ప్రతి రోజు సుమారు 1200 నుంచి 1500 ఓపీ తీసు కుంటారు. సాధారణ వైద్య పరీక్ష కోసం వచ్చే వారితో పాటు అదనంగా సదరం సర్టిఫికెట్లు పొందేందుకు వచ్చేవారు ఉంటారు. వీరందరితో ప్రతి రోజు సర్వజన ఆసుపత్రి కిటకిటలాడుతూ ఉంటుంది. ఈ రద్దీకి సరిపడా ఓపీ కౌంటర్లు లేకపోవడం, రోగులకు తగ్గట్లు సర్వర్ సరిగా పనిచేయక వారి ఓపికకు పరీక్ష పెడుతోంది.

సర్వర్ సమస్యతో సమయం వృథా

సర్వజన ఆసుపత్రిలో ఓపీ కేవలం 12గంటల వరకు మాత్రమే అందుబాటులో ఉంటుంది. 12 గంటలు దాటితే ఓపీ కౌంటర్లు మూసేస్తుంటారు. సర్వర్ సమస్యతో ఒక్కసారి గంటల తరబడి వేచి ఉన్నా ఓపీ దొరక్క రోగులు ఇబ్బంది పడుతున్నారు. సర్వర్ సరిగా పనిచేయడం లేదని కొంతమంది పేద చదువురాని రోగులకు అర్థంకాని పరిస్థితిలో అయోమయానికి గురవుతున్నారు. వైద్యానికి నిరీక్షణ అయితే ఓకే గాని ఓపీ కోసం నిరీక్షించడం ఏంటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చే వారు త్వరగా వైద్య సేవలు పొంది ఇంటికి చేరాలని చూస్తుంటారు. అయితే తరచూ సర్వర్ మొరాయింపుతో సమయం అంతా ఓపీ వద్దే వృథా అవుతోందని వాపోతున్నారు.

వేధిస్తున్న ఓటీపీ సమస్య

ఓపీ చీటీ పొందడానికి సర్వర్ సమస్యతో పాటు ఓపీ ఎంట్రీ చేయడానికి రోగి వివరాలు పొందుపర్చడానికి మొబైల్ ఓటీపీతో మరో సమస్య. చాలా మంది గ్రామీణ పేద రోగులకు స్మార్ట్ ఫోన్‌లు ఉండవు. పైపెచ్చు గ్రామీణ మహిళల్లో మొబైల్ లేని వారు ఉంటారు. సర్వజన ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చే రోగులకు కచ్చితంగా వారి ఆరోగ్య వివరాలను సులభంగా తెలుసుకునే విధంగా ఫోన్‌లో పొందుపరుస్తుంటారు. రిజిస్ట్రేషన్ కోసం ఓటీపీ నమోదు చేయాల్సి ఉంటుంది. ఇవేవీ తెలియక కొందరు ఓపీ కోసం తికమకపడుతున్నారు. వైద్యం కోసం వచ్చే రోగులు ఆదిలోనే ఓపీ కోసం అవస్థలు పడుతున్నారు. ఓపీ అందాక 12 గంటల తర్వాత డాక్టర్లు అందుబాటులో ఉండ కపోవడంతో రోగులు అవస్థలు పడుతున్నారు. ఆసుపత్రి అధికారులు రోగులకు కాస్తో కూస్తో ఉపశమనం కలిగేవిధంగా ఏర్పాట్లు చేసినా పూర్తిస్థాయిలో సహాయ పడలేక పోతున్నారు. రోగులకు ఓపీ కష్టాల నుంచి శాశ్వతగా పరిష్కారం ఎపుడు దొరు కుతుందో అని ఆశగా ఎదురుచూస్తున్నారు.

రోగులకు ఇబ్బంది లేకుండా చేస్తున్నాం.



సర్వర్ సమస్యతో ఓపీ ఆలస్యం అవుతున్న మాట వాస్తవమే. సర్వర్ సమస్య ఉంటే మాన్యువల్‌గా ఓపీ ఇవ్వమని చెప్పాము. ఇక మొబైల్ లేని వారికి సిబ్బంది తమ సొంత ఫోన్‌ల ద్వారా రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. రోగులకు ఇబ్బంది కలుగకుండా ప్రతిరోజు నర్సింగ్ విద్యార్థులతో రోగులకు సహాయం అందిస్తున్నాం. రోగులకు ఇబ్బంది కలుగకుండా మరింత ఏర్పాట్లు చేయడానికి ప్రయత్నిస్తాం.

-డాక్టర్ శ్రీనివాసులు, సీఎస్‌ఆర్‌ఎంఓ, సర్వజన ఆసుపత్రి, కడప





సర్వర్ సమస్యతో ఇబ్బందులు పడుతున్న రోగులు, ఓపి కోసం క్యూలో ఉన్న రోగులు

ప్రతి గ్రామం పరిశుభ్రంగా ఉండాలి

● స్వచ్ఛభారత్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు ఊర్మిలాదేవి



నాడెప్ తొట్లను పరిశీలిస్తున్న స్వచ్ఛభారత్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు

వల్లూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామం పరిశుభ్రంగా ఉంటే.. అంటు వ్యాధులు రాకుండా ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని స్వచ్ఛభారత్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు ఊర్మిలాదేవి అన్నారు. మంగళవారం వల్లూరు గ్రామ పంచాయతీలో ఆమె క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించారు. ముందుగా గ్రామమంతా కలియ దిరిగారు. అనంతరం స్థానిక మండల పరిషత్ పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలతో పాటు అక్కడున్న టాయిలెట్లను పరిశీలించి.. విద్యా శాఖ అధికారులు, ఉపాధ్యాయులు, అంగన్వాడీలతో మాట్లాడారు. ప్రతి రోజూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని పరిశీలించి.. మాట్లాడుతూ ఇళ్లలోని చెత్త నుంచి వేరు చేసిన వ్యర్థపదార్థాలను వానపాముల ద్వారా ఎరువుగా తయారు చేసేం దుకే ఎస్‌డబ్ల్యూపీసీలను ఏర్పాటు చేశారన్నారు. గ్రీన్ అంబాసిడర్లు ప్రతిరోజూ తప్పకుండా డోర్ టు డోరు వెళ్లి చెత్తను సేకరించాలన్నారు. గ్రామాలల్లో చెత్త ఎక్కడ పడితే అక్కడ వేయకుండా పరిశుభ్రంగా ఉండేలా పనిచేయాలన్నారు. స్వచ్ఛ భారత్ ఎంఎస్ కన్సల్టెంట్ శివనారాయణ, డిస్ట్రిక్ట్ కన్సల్టెంట్ సూర్య ప్రకాశ్‌రెడ్డి, జిల్లా కోఆర్డినేటరు సందీప్, వల్లూరు ఎంపీడీవో రఘురాం, ఎమ్మార్సీ నాగముని, పంచాయతీ కర్యాదర్శి శ్రీనివాసులు, స్వచ్ఛభారత్ అధికారులు, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

యాక్సెస్ హెల్త్ కేర్ సేవలు అభినందనీయం



కృత్రిమ కాళ్ల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జేసీ అదితిసింగ్

కడప కలెక్టరేట్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): యాక్సెస్ హెల్త్ కేర్ చెన్నై వారి సేవలు అభినందనీయమని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ కొనియాడారు. మంగళవారం కలెక్టరేట్ సభాభవనంలో జిల్లాలోని విభిన్న ప్రతిభావంతుల కోసం ప్రత్యేక నియమించిన కృతిమ కాళ్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా జేసీ మాట్లాడుతూ గత నెల 6,7వ తేదీలలో 219 మంది కాలు కోల్పయిన విభిన్న ప్రతిభావంతులకు కాలు కొలతలు తీసుకున్నారన్నారు. వారందరికీ యాక్సెస్ హెల్త్ కేర్, ఫ్రీడమ్ ట్రస్ట్ చెన్నై స్పాన్సర్స్ తోడ్పాటుతో ఆధునిక కృతిమ కాలు ఒక్కొక్కటి రూ.51వేలతో మొత్తం 67 మందికి కృతిమ కాళ్లు అమర్చడం అభినందనీయమన్నారు. ట్రస్ట్ ఫౌండర్ సుందర్ మాట్లాడుతూ ఫ్రీడమ్ ట్రస్ట్ ఇలాంటిసేవా కార్యక్రమాల్లో భాగంగా ఉండటం గర్వంగా ఉందన్నారు. యాక్సెస్ హెల్త్ కేర్ ప్రతినిధి ఇలవేందన్ మాట్లాడుతూ వైఎస్సార్ కడప జిల్లాలో విభిన్న ప్రతిభావంతుల కోసం తన వంతు సహాయ సహకారాలు అందించడం సంతోషంగా ఉందన్నారు. ట్రస్ట్ మెంబరు సతీష్‌రెడ్డి, విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు ఆర్వీ క్రిష్ణ కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చూడండి : మంత్రి



పులివెందులలో అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి సవిత

పులివెందుల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పరిధిలో ఎక్కడ తాగునీటి సమస్య లేకుండా చూడాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ అధ్యక్షతన మధ్యాహ్నం అన్ని శాఖలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖల వారీగా ప్రస్తుతం ఏం పనులు చేస్తున్నారు, ఏం పనులు చేపట్టబోతున్నారు, ఎలాంటి పనులు కావాలి అనే మూడు అంశాలపై రివ్యూ సాగింది. ముఖ్యంగా తాగునీటి సమస్యపైన మంత్రి స్పందిస్తూ తాగునీటి అవస రాల కోసం నూతనంగా బోర్లు ఏర్పాటు చేస్తే వాటికి వెంటనే విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. ఇటీవల జరిగిన అరటిపంట నష్టానికి సంబంధించి వివరాలు అడిగి తెలుసు కున్నారు. పంట నష్టపోయిన ఏ రైతుకు అన్యాయం జర గకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సోలార్‌పైన ప్రజలకు ఎలాంటి అవగాహన కల్పిస్తున్నారని ట్రాన్స్‌కో అధికారిని ప్రశ్నించగా అందుకు ఆయన సరైన సమాధానం చెప్పకపోవడంతో మండిపడ్డారు. ప్రతి ఇంటిపైన సోలార్ వ్యవస్థ ఏర్పాటు కావాలని, ఇదే ముఖ్యమంత్రి లక్ష్య మన్నారు. పులివెందులలో చాలా చోట్ల రోడ్లు దెబ్బతిన్నాయని, రోడ్లు ఏర్పాటు చేయాలని ప్రజలు అడుగుతున్నారని తెలుపగా.. పులివెందుల మున్సిపల్ కమిషనర్ రాముడు మాట్లాడుతూ మున్సిపాలిటీలో నిధుల లభ్యత తక్కువగా ఉందని, నిధులు ఉన్న మేరకు రోడ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈసందర్భంగా పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి పులివెందుల ప్రాంత రైతులకు వీలైనంత ఎక్కువ శాతం డ్రిప్పు పరికరాలు అందేలా చూడాలని మంత్రిని కోరారు. పులి వెందుల మున్సిపల్ కమిషనర్ రాముడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ విజయభాస్కర్, జిల్లా ఉద్యానశాఖ అధికారి సుభాషిణి, వ్యవసాయశాఖ జేడీ నాగేశ్వర్‌రావు, ఆర్డీఓ చెన్నయ్య, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో తనిఖీ

వచ్చే విద్యా సంవత్సరం నుంచే తొండూరు మహాత్మాగాంధీ పూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల బాలికల సంక్షేమ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలల్లో తరగతులు ప్రారంభిస్తామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత పేర్కొన్నారు. మంగళవారం మంత్రి తొండూరు సమీపంలో నిర్మాణ పనులు ఆగిపోయిన గురుకుల పాఠశాలను కలెక్టర్ చెరు కూరి శ్రీధర్‌తో కలిసి మంత్రి తనిఖీ చేశారు. తరగతి గదులను, హాస్టల్ గదులను, కిచెన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి విలేకరులతో మాట్లాడుతూ 2018లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ పాఠశాలను మంజూరు చేశారన్నారు. నా బడుగులు, నా బలహీనవర్గాలు అని చెప్పుకొంటూ ఐదేళ్ల కాలం గడిపిన ముఖ్య మంత్రి జగన్ ఈ పాఠశాలను పూర్తి చేయడంలో నిర్లక్ష్యం చూపారన్నారు. ఈ భవన నిర్మాణాకి రూ.10కోట్ల నిధులు సమకూర్చి వచ్చే విద్యాసంవత్సరం నుంచి తరగతులు ప్రారంభిస్తామన్నారు. అనంతరం తొండూరు ఐటీఐ కళాశాలను పరిశీలించారు. ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి, శివమోహన్‌రెడ్డి, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

ఆర్టీపీపీలో ఆక్టోపస్ మాక్ డ్రిల్



ఎర్రగుంట్ల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఆర్టీపీపీలోని ప్రధాన ప్లాంట్‌లో రాష్ట్ర ఆక్టోపస్ టీం మంగళవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. ఉగ్రవాదులు, ఇతర ప్రమాదకర వ్యక్తుల నుంచి ఆపదలొచ్చిన సమయంలో ఆక్టోపస్ అటాకింగ్ ఎలా ఉంటుందో డెమో టెస్ట్ చేసి చూపించారు. ఆక్టోపస్ అడిషనల్ ఎస్పీ రాజారెడ్డి ఆధ్వర్యంలో 42మందితో కూడిన ఆక్టోపస్ టీం మాక్ డ్రిల్ చేశారు. ఉగ్రవాదులు ప్లాంట్లలో చొరబడినప్పుడు ఆక్టోపస్ వేగంగా ఎలా స్పందిస్తుందో చేసి చూపించారు. అధు నాతన ఆయుధాలు, ట్రైనీ డాక్స్, సేఫ్టీ పరికరాలతో వారు ప్లాంటులో డెమో ఇచ్చారు. మంగళ వారం ఉదయం కొండాపురం సీఐ రఫి, స్థానిక రెవెన్యూ అధికారులు, వైద్యాధికారులు, ఇతర అధికారులతో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

డీఈఓ వెబ్‌సైట్‌లో స్కూల్ అసిస్టెంట్‌ల సీనియారిటీ జాబితా

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): జోన్-4 పరిధి లోని అనంతపురం, చిత్తూరు, కడప, కర్నూలు పూర్వపు జిల్లాలోని స్కూల్ అసిస్టెంట్ (గవర్నమెంట్) నుంచి గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయ పోస్టు పదోన్నతులకు సంబంధించి సీనియారిటీ జాబితా ఆర్జేడీ వెబ్‌సైట్‌లో ఉన్నట్లు ఆర్జేడీ కె.శామ్యూల్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యంతరాలు ఉంటే ఈనెల 11వ తేదీ లోపు ఆధారాలతో సంబంధిత డీఈఓ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు.

కృషి పట్టుదలతో విజయం సొంతం

కడప ఎడ్యుకేషన్,ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రణాళికబద్ధమైన కృషి, పట్టుదల, విజయతీరాలను చేర్చుతాయని కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి అన్నారు. మంగళవారం యోగివేమన యూనివర్సిటీలో ఉద్యోగ ఉపాధి అవకాశాలపై 'యూనివర్సిటీలో ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులు అవకాశాలను ఉపయోగించుకోవాలని కోరారు. హైదరాబాద్ కెరీర్‌కన్సల్టెంట్‌సంస్థ సీఈఓ రోహిత్‌రావు మాట్లాడుతూ సరైన ప్రణాళిక, క్రమశిక్షణ ఉద్యోగ అవకాశాలపై విద్యార్థులకు మెళకువలను ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ ఆచార్య జి.విజయభారతి, సభ్యులు డాక్టర్ గణేష్ నాయక్ మాట్లాడారు. కార్యక్రమంలో హైదరాబాద్ కెరీర్ కన్సల్టెంట్ సంస్థ పత్తిని, హృత్విక్, మణికంఠ, ప్రియ, మేఘన, సాకేత్, అభినయ, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయ సెస్‌ను గ్రంథాలయాలకే ఉపయోగించాలి



మాట్లాడుతున్న వల్లూరు శివప్రసాద్

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాల అభివృద్ధికి గ్రంథాలయ సెస్‌ను ఉపయోగించి.. వాటి ప్రగతికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆంధ్రప్ర దేశ్ రాష్ట్ర పునర్వికాస ఉద్యమ వేదిక కన్వీ నర్ వల్లూరు శివప్రసాద్ కోరారు. మంగళ వారం కడప నగరం సీపీ బ్రౌన్ గ్రంథాలయంలో అభ్యుదయ రచయితల సంఘం, ఇంటాక్ కడప చాప్టర్ సంయుక్త ఆధ్వ ర్యంలో గ్రంథాలయోద్యమ పునర్వికాస ఉద్యమ వేదిక సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వల్లూరు శివప్రసాద్ మాట్లాడుతూ 1960లో ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ లైబ్ర రీ యాక్ట్ ప్రకారం ప్రజలు కట్టే పన్నుల్లో 8శాతం గ్రంథాలయ సెస్ ఉందని, ఆ నిధులను గ్రంథాలయాల ప్రగతికి ఉపయోగించాలని కోరారు. పదేళ్ల కాలంలో రూ.350 కోట్లకు పైగా గ్రంథాలయాల సెస్సు ప్రభుత్వం వసూలు చేసిందని, అందులో కేవలం రూ.20కోట్లకు మించి ఖర్చు చేయలేదని విశ్లేషించారు. సిబ్బంది కొరత, భవనల లేమి, కొత్తపుస్తకాలు కొనుగోలు చేయలేకపోవడం వంటి సమస్యలతో సతమతమవుతున్నాయని తెలిపారు. ప్రతి జిల్లాలోను గ్రంథాలయ పునర్వి కాసుద్యమ వేదిక సభలు నిర్వహిం చిన అనంతరం 27వ తేదీన రాష్ట్రస్థాయి సదస్సును రచయితలు, గ్రంథాలయ అభిమానులు, సాహితీవేత్తలతో నిర్వహించను న్నామని తెలిపారు. కడప జిల్లా అధ్యక్షుడు ఆచార్య ఎన్.ఈశ్వర్‌రెడ్డి, ఇంటాక్ జాతీయ పాలక మండలి సభ్యులు లయన్ కె.చిన్నపరెడ్డి, ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం కడప జిల్లాశాఖ అధ్యక్షుడు జాన మద్ది విజయభాస్కర్, సీపీ బ్రౌన్ గ్రంథాలయ సంచా లకులు ఆచార్య జి.పార్వతి తదితరులు పాల్గొన్నారు.

పసుపు యార్డులో వసతులు కల్పించాలి

● మర్చంట్ అసోసియేషన్ డిమాండ్

కడప రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కడప పసుపు మార్కెట్ యార్డులో రైతులు తీసుకువచ్చే పంట ఉత్తత్తులకు సౌకర్యాలకు కల్పించాలని కడప మర్చంట్ అసోసియేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు రామక్రిష్ణారెడ్డి, జవహర్‌లాల్ చౌదరిలు డిమాండ్ చేశారు. మంగళవారం మార్కెట్‌యార్డులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పసుపు మార్కెట్ యార్డులో ఇటీవల కురిసిన వర్షానికి దాదాపు 1500 నుంచి 2000ల పసుపు బస్తాలు వర్షపు నీటిలో మునిగిపోయాయన్నారు. రైతులు తమ ఉత్పత్తులను ఉంచుకోవానికి తగిన షెడ్లు లేకపోవడంతో ఇలా జరిగిందన్నారు. ప్రస్తుతం పసుపు విక్రయాలు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. కానీ రైతులు తీసుకువచ్చే పంట ఉత్పత్తులకు యార్డులో తగిన మౌలిక వసతులు లేకపోవడంతో అటు రైతులు, ఇటు వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ముఖ్యంగా మార్కెట్ యార్డులో సక్రమంగా రోడ్లు, డ్రైనేజీ కాలువలు లేకపోవడంతో వర్షపు నీరంతా యార్డులోనే రోజుల తరబడి నిలుస్తోందన్నారు. ఇక రైతులకు విశ్రాంతి భవనాలు, మంచినీటి సదుపాయం, మరుగుదొడ్ల సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నార న్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పసుపు యార్డులో రైతులకు అవసరమైన మౌలిక వసతులను కల్పించాలని కోరారు. కడప మర్చంట్ అసోసియేషన్ సెక్రటరీ రాఘవులు, జాయింట్ సెక్రటరీ నరసింహులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మైదుకూరు రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మంగారిమఠం మండలం కొత్త బసవాపురం గ్రామానికి చెందిన కె.శ్రీకాంత్(22) మంగళవారం జరిగిన రోడ్డు ప్రమా దంలో మృతి చెందాడు. శ్రీకాంత్ స్కూటీపై బ్రహ్మంగారిమఠం నుంచి మైదుకూరు వైపునకు వస్తుండగా, మైదుకూరు మండలం వనిపెంట సమీ పంలో మైదుకూరు నుంచి పోరుమామిళ్ల వైపు అతివేగంగా వెళుతున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రగా యా లైన శ్రీకాంత్‌ను కర్నూలు ఆసుపత్రికి తరలిస్తుండగా నంద్యాల వద్ద మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏపీజీబి తరలింపు మానుకోవాలి



ఆర్సీపీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద చేస్తున్న నిరసన

కడపసెవెన్ రోడ్స్, మార్చి 8 (ఆంధ్ర జ్యోతి): బ్యాంకుల విలీనం చేస్తూ ఆర్బీఐ ఇచ్చిన నోటిఫికేషన్ నిరసిస్తూ రాయ లసీమ కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం కడప కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి రవిశంకరెడ్డి మాట్లాడుతూ దేశంలోని అతిపెద్ద రూరల్ బ్యాంక్ అయిన ఏపీజీబీ ప్రధాన కార్యాలయం కడప నుంచి అమరావతికి తరలించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయ రాయలసీమకు శరాఘాతం అని మండిపడ్డారు. ముఖ్యమంత్రి మైదుకూరుసభలో ఏపీజీబీబీ తరలింపు ఉండదు అని స్పష్టమైన హామీ ఇచ్చి ఇంత అన్యాయం చేయడం ఘోరమని దుయ్య బట్టారు. ఇది రాయలసీమకు తీరని అన్యాయ మన్నారు. రాష్ట్రంలోని నాలుగు బ్యాంకులు విలీనం చేస్తూ ఒకే బ్యాంకుగా నిర్ణయించిన కేంద్ర ప్రభుత్వం ప్రధాన కార్యాలయాన్ని కడపలో ఉండడానికి కావా ల్సిన నిబంధనలు ఉన్నా కడప నుంచి ఏపీజీబీ ప్రధాన కార్యాలయం అమరావతికి తరలించాలన్న నిర్ణయం సరికాదన్నారు. ఆర్సీపీ నగర కారదర్శి మక్బూల్ బాష, తస్లీమ్ తదితరులు పాల్గొన్నారు.

కోర్టులో గంగమ్మకు పూజలు


ప్రత్యేక అలంకరణలో కోర్టులో గంగమ్మ

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 8 (ఆంధ్ర జ్యోతి): స్థానిక కోర్టులో వెలసిన గంగమ్మను మంగళవారం ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయ అర్చకుడు సుస్మిత్ పుష్పాలతో అలంకరణ చేసి అమ్మవారిని భక్తులకు దర్శనం కల్పించారు. రాహుకాల పూజల అనంతరం మహిళలు చీర, జాకెట్లు, పొంగళ్లు సమర్పించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

జిల్లా షూటింగ్ బాల్ జట్టుకు మోడల్ స్కూల్ విద్యార్థులు


షూటింగ్ బాల్ జట్టుకు ఎంపికైన మోడల్ స్కూల్ విద్యార్థులు

తంబళ్లపల్లె, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా సబ్ జూనియర్స్ షూటింగ్ బాల్ జట్టుకు తంబళ్లపల్లె మోడల్ స్కూల్ నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు పీడీ లత తెలిపారు. బాలుర విభాగంలో అజ్జార్‌మహమ్మద్, గౌస్‌మహమ్మద్ స్టాండ్ బై ప్లేయర్‌గా హర్షవర్ధన్ ఎంపిక వ్వగా, బాలికల విభాగంలో కరీమున్నీసా ఎంపికయ్యారు. ఆయా విద్యార్థులను ఎం ఈవోలు త్యాగరాజు, నాగసుబ్బరాయు డు, ప్రిన్సిపాల్ హేమంత్‌కుమార్ అభినందించారు.

ట్రాన్స్‌కో ఏఈగా నాగరాజు

నిమ్మనపల్లి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మండల ఏఈఈగా నాగరాజు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఇన్‌చార్జి ఏఈగా విమల విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు 9 గంటలు, ఇళ్లకు నిరంతర విద్యుత్ సరఫరా కొనసాగిస్తానని తెలిపారు. రైతులకు అందుబాటులో ఉండి పెండింగ్ ఉన్న విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

రేపు వాల్మీకిపురం మండల సర్వసభ్య సమావేశం

వాల్మీకిపురం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 10వ తేదీ గురువారం మధ్యాహ్నం ఎంపీపీ అరుణ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మనోహర్‌రాజు తెలిపారు. మండలంలోని వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు తప్పక హాజరు కావాలని తెలియజేశారు.

లక్ష్మీనరసింహాలయానికి కలశాలు విరాళం


కలశాలు అందజేస్తున్న నార శ్రీనివాసులు, కుటుంబ సభ్యులు

పెద్దమండ్యం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి) మండలంలోని పాపేపల్లి నరసింహస్వామి ఆలయానికి తమ తల్లిదండ్రులు నార వెంకటప్ప, నార పాపులమ్మ సోదరులు లక్ష్మీనారాయణ, వెంకటరమణ జ్ఞాపకార్థం రూ. 1లక్ష విలువైన కలశాలను దేవస్థానం ప్రధాన అర్చకుడు విష్ణుమాచార్యులు ద్వారా అందజేసినట్లు పెద్దమండ్యంకు చెందిన టీడీపీ సీనియర్ నాయకులు నార రామచంద్రయ్య, నార శ్రీనివాసులు, నార రామకృష్ణ తెలిపారు. ఇటీవలే ఈ ఆలయ గాలిగోపురం నిర్మాణం పూర్తయింది. ఈ నెల 28, 29, 30న పుష్పగిరి పీఠాధిపతి ఆధ్వర్యంలో కుంభాభిషేకం నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు..

'విధి' షార్ట్ ఫిలిం ప్రారంభం



షార్ట్ ఫిలింను ప్రారంభిస్తున్న డాక్టర్ అప్పినిపల్లె భాస్కరాచారి

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 8 (ఆంధ్ర జ్యోతి): మదనపల్లెలో మంగళవారం నిర్మాత డాక్టర్ అప్పినిపల్లె భాస్కరాచారి 'విధి' అనే షార్ట్ ఫిలింను క్లాప్ కొట్టి ప్రారంభించారు. కో డైరెక్టర్ మణికంఠ రాజేంద్రబాబు, రాజా, మంజునాథ్, పవన్‌కుమార్ రాజ్, నవీన్‌గౌడ్, బిఆర్ ప్రసాద్, పి. శ్రీనివాసులు, నరసింహాచార్యులు, నాగభూషణ రావు, గాలి చిన్న నటిస్తున్నారు. కార్యక్రమంలో మునిగోపాలకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

నిమ్మనపల్లి రోడ్డు.. నిత్యం ప్రమాదాలే!

- గ్రామస్థులు, రైతుల బాధ్యతా రాహిత్యంతో గోతులమయం
- కలగానే మిగిలిన రోడ్డు విస్తరణ

నిమ్మనపల్లి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిర్లక్ష్యంతోపాటు ప్రజల బాధ్యతా రాహిత్యంతో మదనపల్లి-నిమ్మనపల్లి రోడ్డు ప్రమాదకరంగా మారింది. 27 కిలో మీటర్లు ఉండే ఈ సింగిల్ రోడ్డులో నిమ్మనపల్లి మండలానికి చెందిన రైతు లు వ్యవసాయ ఉత్పత్తులను విక్రయించేందు నిత్యం పెద్ద సంఖ్యలో మదనపల్లికి వెళుతుంటారు. టమాటా రైతులు రాత్రి వేళల్లోనే వాహనాల ద్వారా టమాటాలను మార్కెట్‌కు తరలిస్తుంటారు. కూలి పనుల నిమిత్తం వందల సంఖ్యలో ప్రజలు వెళుతుంటారు. నిరంతరం ఇంతటి రద్దీగా ఉండే మార్గాన్ని గత టీడీపీ ప్రభుత్వం 10 కిలోమీటర్ల వరకూ డబుల్ రోడ్డుగా విస్తరించింది . అనంతరం వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ రోడ్డు విస్తరణను అసలు పట్టించుకోలేదు. దీంతో రోడ్డు గుంతలమయమైంది. రెడ్డివారిపల్లి మోడల్ స్కూల్ వద్ద గుంతలు ప్రమాదకరంగా మారాయి. మాచిరెడ్డిగారిపల్లి, సత్రం, పిట్టావాండ్లపల్లి, చల్లావారిపల్లి వద్ద రైతులు పైపులు అమర్చేందుకు గాడి తీసి వదిలేశారు. దీనికి తోడు గ్రామాలలో ఇష్టం వచ్చిన చోట స్పీడ్ బ్రేకర్‌లు వేయడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడంలేదు. తాము అధికారంలోకి రాగానే ఈ రోడ్డును అభివృద్ధి చేస్తామని ఓట్లు వేయించుకున్న నాయకులు, ఆ తర్వాత ఆ విషయం విస్మరిస్తున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు సైతం పదేళ్లుగా నిమ్మనపల్లి- కందూరు వరకు డబుల్ రోడ్డుకు ప్రతిపాదనలు పంపామని చెబుతున్నారే తప్ప, కార్యరూపం దాల్చలేదు. పైగా మదనపల్లిని జిల్లా కేంద్రంగా ప్రకటిస్తారని చెబుతున్నా రోడ్ల పరిస్థితి మాత్రం ఎవరూ పట్టించు కోలేదు. ప్రస్తుత ప్రభుత్వమైనా నిమ్మనపల్లి-కందూరు రోడ్డు వేసి రోడ్డు ప్రమాదాలను అరికట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.


మాచిరెడ్డిగారిపల్లి వద్ద గుంతలు పడిన రోడ్డు

ప్రజల రుణం తీర్చుకుంటా.. : ఎమ్మెల్యే నల్లారి

వాల్మీకిపురం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఎన్నికలలో ఆదరించిన ప్రజల రుణం అభివృద్ధి చేసి తీర్చుకుంటానని ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం వాల్మీకిపురం మండల వ్యాప్తంగా పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదల సంక్షేమం ధ్యేయంగా కృషి చేస్తానన్నారు. సంక్షేమ పథకాలు, నిరుపేదలందరికీ అందేలా చూస్తానన్నారు. మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి, పీలేరు మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్‌బాషా, మార్కెట్ ఛైర్మన్ కోసూరి చంద్రమౌళి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటరమణ, మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లిగట్ల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను సన్మానించిన పంచాయతీ కార్మికులు

కలికిరి:పీలేరు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పనిచేస్తున్న పంచాయతీ కార్మికులు మంగళవారం ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. నగిరిపల్లెలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ధనాశి వెంకటరామయ్య మాట్లాడుతూ తమ సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించడం తమకు ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. ఎమ్మెల్యే ప్రసంగంతో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ తమ సమస్యలపై దృష్టి సారించారన్నారు. అందుకు కృతజ్ఞతగా తాము ఎమ్మెల్యేను సన్మానించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో పీలేరు ఏఎంసీ ఛైర్మన్ పురం రామ్మూర్తి, టీడీపీ నాయకులు కోటపల్లె శ్రీనాథరెడ్డి, నరేశ్, కార్మిక నాయకులు కలకడ హరిప్రసాద్, మౌలా, ఓబులేశు, పులి రెడ్డప్ప, నాగార్జున, వైఎస్ మస్తాన్, చిట్టెమ్మ, సుబ్బలక్ష్మి, రాధారాణి, సరోజ, సుబ్రహ్మణ్యం, శాంతి కుమారి, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి

13న ములకలచెరువులో మంత్రుల పర్యటన

- తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి

ములకలచెరువు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఈ నెల 13న జిల్లా ఇన్‌చార్జి మంత్రి జనార్దన్ రెడ్డి, మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డి పర్యటిస్తారని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి తెలిపారు. ఈ మేరకు ములకలచెరువులో జరిగే తంబళ్లపల్లె నియోజకవర్గ స్థాయి టీడీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించేందుకు మంగళవారం మార్కెట్ యార్డు స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ములకలచెరువు మార్కెట్ యార్డులో ఈ నెల 13 న జరిగే నియోజకవర్గ కార్యకర్తల సమావేశానికి అన్ని గ్రామాల నుంచి కార్యకర్తలు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. నియోజకవర్గ కార్యకర్తల సమావేశం అనంతరం మండలాల వారీగా నాయకులు, కార్యకర్తలతో మంత్రులు సమీక్ష నిర్వహించడంతో పాటు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తారన్నారు. అంతకు మునుపు పార్టీ కార్యాలయంలో బురకాయల కోటకు చెందిన మునేశ్వరికి రూ. 4 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు ఫణులు, గణేష్‌రాజు, గోపాల్ రాజు, ముకుంద రాజు, తిప్పరాజు, శ్రీనివాసులు నాయుడు, వెంకటరమణ రాజు, మద్దిరెడ్డి, గంజి మోహన, ఎర్రంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సీఎం సహాయ నిధి చెక్కు అందజేస్తున్న టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి

వక్ఫ్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలి

- ఇండియా కూటమి నేతల డిమాండ్

మదనపల్లె, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ముస్లింలు కాని వాళ్లను వక్ఫ్ కమిటీల్లో ఎలా నియమిస్తారని.. ముస్లింల మతస్వేచ్ఛకు భంగం కలిగించే వక్ఫ్ సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలని వీసీకే పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీఎం శివప్రసాద్ డిమాండ్ చేశారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ స్థానిక సీపీఐ పార్టీ కార్యాలయంలో మంగళవారం వీకేసీ పార్టీ అధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వక్ఫ్ సవరణ బిల్లు జాతీయ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. వీకేసీ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీఏ పీర్‌బాషా, కాంగ్రెస్ నేత రెడ్డిసాహెబ్, సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, సీపీఐ నేతలు తోపు కృష్ణప్ప, కోటూరి మురళి, బాస్ రాష్ట్ర అధికార ప్రతినిధి ముత్యాల మోహన్, రాష్ట్ర గిరిజన సమాఖ్య అధ్యక్షుడు కోనేటి దివాకర్, న్యాయవాదులు సోమశేఖర్, సుహేల్, ముస్లిం ఐక్యవేదిక అధ్యక్షుడు ఫైజ్ అహమ్మద్ తదతరులు మాట్లాడుతూ ముస్లిం సమాజం మత స్వాతంత్ర్యాన్ని దెబ్బతీసే విధంగా సవరణ బిల్లు రూపొందించారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇతర మత సమాజాల ఆస్తుల విషయంలో జోక్యం చేసుకోనప్పుడు, వక్ఫ్ బోర్డు వ్యవహారాల్లో మాత్రం ఎందుకు దూకుడు చూపిస్తోందని ప్రశ్నించారు. ఈ చట్టం దేశ ప్రజల ఐక్యత, సామరస్యాన్ని దెబ్బతీస్తుందన్నారు. ముస్లిం భూముల తరువాత క్రైస్తవులు, బౌద్ధులు, చివరగా హిందువుల భూములు, ఇలా ఒక్కొకటిగా దానీ, అంబానీ వంటి కార్పొరేట్ కుబేరులకు అప్పగించి వారి ఆశీర్వాదంతో అధికారాన్ని కాపాడుకోవాలని బీజేపీ చూస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో బాస్ కోశాధికారి నీరుగట్టి రమణ, బీకేసీ టౌన్ ప్రెసిడెంట్ బురుజు రెడ్డి ప్రసాద్, బాస్ టౌన్ ప్రెసిడెంట్ ఇర్ఫాన్‌ఖాన్, స్థానిక నాయకులు చాట్ల బయన్న, రెడ్డెప్ప, రమణ, గంగాధర్, ముస్లీం ప్రతినిధులు మన్సూర్, షాహీద్‌బేగ్, ఇలియాజ్, రోషన్, అష్రఫ్, తదితరులతోపాటు పెద్దసంఖ్యలో ముస్లీం ప్రతినిధులు పాల్గొన్నారు.

ముస్లింలను దెబ్బతీయడానికే..

మదనపల్లె అర్బన్: వక్ఫ్ చట్ట సవరణ బిల్లుకు టీడీపీ, జనసేన. వైసీపీలు మద్దతు ఇచ్చి ముస్లింలకు ద్రోహం చేశారని కాంగ్రెస్ నేత రెడ్డి సాహెబ్ అన్నారు. వీసీకే పార్టీ నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీల తీరుపై మండిపడ్డారు. వివిధ పార్టీలు వక్ఫ్ సవరణ బిల్లును వక్రీకరించారని ఆరోపించారు. వక్ఫ్ చేసే ముందే ఆస్తులపై అన్ని అంశాలు ధ్రువీకరిస్తారని, వక్ఫ్ చేసిన వారికే తిరిగి తీసుకునే హక్కు ఉండదన్నారు. కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమి పార్టీలు మాత్రమే వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకించాయన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న పీటీఎం శివప్రసాద్

న్యాయం కోసం ప్రశ్నిస్తే పోలీసు కేసులా..?

- మాజీ సైనికుల ఆవేదన

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఓ మాజీ సైనికుడి కుమారుడి బలవన్మరణంపై న్యాయం కోసం అధికారులకు ప్రశ్నిస్తే తమపైనే కేసులు పెట్టడం దారుణమని మాజీ సైనికుల సంక్షేమ సంఘం డివిజన్ అధ్యక్షుడు కంచర్ల శ్రీనివాసులునాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్‌ను కలసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ వాల్మీకిపురం మండలంలో మాజీ సైనికుడి కుమారుడు వెంకటాద్రి తానుఅనుభవిస్తున్న భూమిని ఆన్‌లైన్ చేయనందుకు సూసైడ్‌నోట్ రాసి ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. వారి కుటుంబానికి అండగా తాము ఆందోళన చేస్తే పోలీసులు దురుసుగా ప్రవర్తించారన్నారు. దీనిపై ప్రశ్నించినందుకు తమపై నాలుగుసెక్షన్లతో కేసులు నమోదు చేస్తున్నట్లు నోటీసులు ఇచ్చారన్నారు. దేశం కోసం పోరాడిన తమపై పోలీసులు తప్పుడు కేసులు పెట్టారని విచారం వ్యక్తం చేశారు.

ఈ కేసులపై సమీక్షించి, వెంటనే కేసులు ఎత్తివేయాలని కోరారు. అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.


సబ్‌కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న మాజీ సైనికుల సంఘం నాయకులు

చెట్టు నరికివేసినందుకు కేసు నమోదు

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి):అక్రమంగా చెట్టు నరికినందుకు కేసు నమోదు చేసినట్లు తాలూకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. పోలీసుల వివరాల మేరకు మదనపల్లె పట్టణం, దేవళంవీధి చెందిన రామలక్షుమ్మ, రామకృష్ణాచారి దంపతులకు 8 మంది పిల్లలుండగా, అంకిశెట్టిపల్లె, కొత్తపల్లె గ్రామ రెవెన్యూపరిధిలో 30 సెంట్ల భూమి ఉంది రామకృష్ణాచారి మరణానంతరం తల్లి రామలక్ష్మమ్మ పేరిట భూమిని మార్చుకున్నారు., ఈ నెల 6న మదనపల్లె పట్టణం, రామారావు కాలనీకి చెందిన మాదిన భాస్కర, అతని భార్య శాంతమ్మ ఆ భూమిలోని చింత చెట్టు నరుకుతున్నట్లు సమాచారం అందడంతో రామకృష్ణాచారి వారసులు అక్కడికి వెళ్లి ప్రశ్నించగా వారు ఎస్సీఎస్టీ కేసులు పెడతామని బెదిరించారు. ఆ చింతచెట్టును లక్ష రూపాయలకు అమ్ముకున్నట్లు జగదీశ్వరి అనే మహిళ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో కార్మికుడికి తీవ్ర గాయాలు


చికిత్స పొందుతున్న నిర్మాణ కార్మికుడు రమేష్

ములకలచెరువు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో భవన నిర్మాణ కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు...బి.కొత్తకోట మండలం ఎగువశీలిపలెకు చెందిన రమేష్ (23) భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. మంగళ వారం పనులు చేసేందుకు ద్విచక్ర వాహనంలో మండలంలోని బురకాయల కోటకు వచ్చాడు. పని ముగించుకుని స్వగ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యంలో ఎదురుగా వచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయ పడిన అతనిని మదనపల్లె ఆస్పత్రికి తరలించారు.

ప్రశాంత్‌నగర్‌లో చోరీ

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ప్రశాంత్‌నగర్‌లోని ఓ ఇంట్లో దొంగలు బంగారు నగలు చోరీ చేశారు. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు బీఎస్ఎన్ఎల్‌లో పని చేస్తున్న ఎర్రిస్వామి గత నెల 30న అరుణాచలం వెళ్లి, సోమవారం రాత్రి మదనపల్లెకు తిరిగి వచ్చాడు. ఇంటి తలుపులు తెరచి ఉండడంతో లోనికి వెళ్లి పరిశీలించి 80 గ్రాముల బంగారు నగలు అపహరణకు గురైనట్లు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్న ట్లు సీఐ రామచంద్ర తెలిపారు.

రోడ్డుపై మురుగు నీటితో అవస్థలు


గుడిబండ 2వ వార్డులో రోడ్డుపై నిలిచిన మురుగు నీరు

కలకడ, ఏప్రిల్ 8 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని గుడిబండ పంచాయతీ రెండవ వార్డులో రోడ్డుపై మురుగునీరు నిల్వ ఉండ డంతో అవస్థలు పడుతు న్నట్లు స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. కొన్నేళ్ల కిం దట ఈ ప్రాంతాల్లో సీసీ రోడ్లు నిర్మించినా కాలువలు నిర్మించలేదన్నారు. దీంతో మురుగు ఇళ్ల ముందు నిలుస్తోందని వాపోతున్నారు. ఈ విషయం అధికారులకు పలుమార్లు తెలిపిన పట్టించుకోవడం లేదని తెలిపారు.

వక్ఫ్ సవరణ బిల్లుపై అభ్యంతరాల స్వీకరణ


మౌలానా ముస్తాక్ అహ్మద్‌ను సన్మానిస్తున్న ముస్లిం మతపెద్దలు

పీలేరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకు వచ్చిన వక్ఫ్ సవరణ బిల్లుపై అభ్యంతరాలు, సలహాలు, సూచనల కోసం రాష్ట్రంలో పర్యటిస్తున్నట్లు రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ ఛైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్ తెలిపారు. ఆ బిల్లుపై అభ్యంతరాలను చర్చించేందుకు మంగళవారం ఆయన పీలేరులోని ముస్లిం మతపెద్దలు, ముతవల్లీలు, ఆలింలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వక్ఫ్ సవరణ బిల్లుపై రాష్ట్రంలోని ముస్లింల మనోభావాలు, అభ్యంతరాలు, సలహాలు, సూచనల సేకరణ కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో రాష్ట్రమంతటా పర్యటిస్తున్నట్లు వివరించారు. తెలుగుదేశం పార్టీ ప్రతిపాదించిన మూడు సవరణలను కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అంగీకరించిందని, రాష్ట్రంలోని ముస్లింల ద్వారా అందిన మరికొన్నింటిని కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి పొందుపరుస్తారన్నారు. రాష్ట్ర దూదేకుల కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఇమ్దాదుల్లా ఇంటిలో జరిగిన ఈ కార్యక్రమంలో ముతవల్లీలు అల్లావుద్దీన్, చాన్‌బాషా, ఇబ్రహీం, సైఫుల్లా, నయాజ్ మౌలానా, తమీమ్ హజరత్, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

జీవో 30ని సద్వినియోగం చేసుకోండి


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు భీమేశ్వర రావు

పీలేరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వివాదరహిత ప్రభుత్వ భూముల్లోని ఇళ్లను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెంబరు 30ను సద్వినియోగం చేసుకో వాలని పీలేరు మండల ప్రజలకు తహసీల్దారు భీమేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. జీవోఎంఎస్ నెం 30పై మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో వివరించారు. వివాదాలు లేని ప్రభుత్వ భూముల్లో ఇళ్లను నిర్మించుకున్న వారి విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం ఈ జీవోను తీసుకువచ్చిందన్నారు. గతంలో ఉన్న జీవో ఎం.ఎస్.నెం.225కు కొన్ని సవరణలు చేసి జీవో ఎం.ఎస్.నెం.30 తీసుకువచ్చిందన్నారు. ఈ జీవో ప్రకారం 15.10.2019 తేదీకి మునుపు నిర్మితమైన ఇళ్లు మాత్రమే క్రమబద్ధీకరణకు పరిశీలిస్తారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నెలకు రూ.10 వేల కంటే తక్కువ ఆదాయం ఉన్న వారు, 10 ఎకరాల కంటే తక్కువ పొలం ఉన్న వారు, ఆదాయ పన్ను చెల్లించని వారు మాత్రమే అర్హులని ఆయన తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో నెలకు రూ.12 వేల ఆదాయం ఉన్న వారు అర్హులన్నారు. 150 చదరపు గజాల కంటే తక్కువ విస్తీర్ణం ఉన్న వారికి ప్రభుత్వం ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయిస్తుందన్నారు. 151 చదరపు గజాల కంటే ఎక్కువ ఉన్న వారు ప్రభుత్వం నిర్దేశించిన మేరకు చార్జీలు చెల్లించాలన్నారు. పూర్తి వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఈ సమావేశంలో డీటీలు సుబ్రహ్మణ్యం, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ అప్‌డేట్ తప్పని సరి

పీలేరు రూరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి):పీలేరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో భూములు, ఇళ్ల రిజిస్ట్రేషన్‌లకు వచ్చే ప్రతి ఒక్కరు విధిగా తమ ఆధార్‌కార్డులను అప్‌డేట్ చేయించుకోవాలని సూచించారు. పదిహేను ఏళ్ల క్రితం చేయించుకొన్న ఆధార్ కార్డుల కారణంగా రిజిస్ట్రేషన్ సమయంలో ఫొటోల్లో వ్యత్యాసం వస్తుందని తెలిపారు. రిజిస్ట్రేషన్ ఇబ్బందులను గుర్తించి సత్వరం ప్రతి ఒక్కరు తమ ఆధార్ కార్డులను అప్‌డేట్ చేసుకోవాలని కోరారు.

విద్యా సామగ్రి సకాలంలో పంపిణీ చేయాలి


కలకడ: స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న డాక్టర్ పెంచలయ్య

పీలేరు రూరల్/కలకడ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలకు విద్యా సామగ్రిని సకాలంలో పంపిణీ చేయాలని రాష్ట్ర పరిశీలకుడు డాక్టర్ పెంచలయ్య అన్నారు. మంగళవారం పీలేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కలకడలోని ఆదర్శ పాఠశాలలో విద్యా సామగ్రి భద్రపరుచు గదులను పరిశీలించారు. విద్యాసామగ్రి అందిన వెంటనే పాఠశాల కమిటీ సభ్యుల సమక్షంలో పాఠశాలకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో అన్నమయ్య అధి కారి వెంకట్రామయ్య, ఎంఈవోలు లోకేశ్వర్‌రెడ్డి, పద్మావతి, రామ చంద్రారెడ్డి, సీఆర్పీలు పాల్గొన్నారు.

రోగులకు అన్నదానం

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని రోగులకు మంగళవారం సద్గురు సంస్థ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ప్రతి మంగళ, గురువారాలతో పాటు, అమావాస్య, పౌర్ణ మిలకు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు అన్నదానం చేస్తున్నట్లు ఆ సంస్థ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, హరి, మంజునాధ్, పూల నాగరాజ, రెడి కిషోర్, అశ్వత్థనారాయణ, కృష్ణ, సీతారాం, తంగెళ్ల పాపయ్య, సీటీఎం గిరప్ప, పెరవలి రెడ్డెప్ప, తదిత రులు పాల్గొన్నారు.

అభివృద్ధి సంక్షేమానికి పెద్దపీట

పీలేరు రూరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి సంక్షేమానికి పెద్దపీట వేయడమే తమ అభిమతమని పీలేరు ఎంపీపీ కంభం సతీష్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఎంపీపీ అధ్యక్షతన పీలేరు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో మండలంలోని ప్రజలకు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా తాగునీరు అందించాలన్నారు. వలసలు నివారించి ఉపాధి పనులు కల్పించాలని కోరారు. మండలంలో సబ్సిడీపై జిప్సం అందిస్తున్నట్లు తెలిపారు. ఎర్రగుంటపల్లె పంచాయతీ కార్యదర్శి తన పని తీరు మార్చుకొని, పార్టీలకు అతీతంగా వ్యవహరించాలని సూచించారు. వేసవిలో పశువుల దాహం తీర్చడం కోసం మొదటి విడతలో 29 నీటి తొట్టెలను నిర్మిస్తున్నట్లు ఏపీవో అశోక్‌రెడ్డి తెలిపారు. జీవో 30 ప్రకారం అర్హులైన వారు స్థలాల రిజిస్ట్రేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ భీమేశ్వరరావు తెలిపారు. భూ రీసర్వే ద్వారా ఏర్పడిన సమస్యలను ఆరు నెలల్లో సరిచేస్తామని తెలిపారు. ఎంపీడీవో శివశంకర్ మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు విధిగా గ్రామాల్లో పర్యటించి ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవచూపాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

పగలే వెలుగుతున్న వీధి దీపాలు


ఐటీఐ ముందు వెలుగుతున్న వీధిలైటు

తంబళ్లపల్లె, ఏప్రిల్ 8 (ఆంధ్ర జ్యోతి): విద్యుత్ వృథాను అరికట్టాలని ప్రభుత్వాలు చెబుతున్నా.. తంబళ్లపల్లెలో మాత్రం అమలు కావడం లేదు. మండల కేంద్రంలోని ప్రధాన రహదారితో పాటు పలు వీధులలో కొన్ని రోజులుగా వీధి లైట్లు నిరంతరం వెలుగుతుండటమే దీనికి నిదర్శనం. ప్రభుత్వాసుపత్రి, ప్రభుత్వ ఐటీఐ, ఇండియన్ బ్యాంకుతో పాటు వెంకటేశ్వర వీధి, రామాలయం వీధుల్లో వీధి దీపాలు రాత్రి, పగలు తేడా లేకుండా వెలుగుతున్నాయి. దీని ఫలితంగా విద్యుత్ శాఖ, గ్రామ పంచాయతీలకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. అధికారులు స్పందించి వీధి దీపాలకు ఆన్, ఆఫ్ స్విచ్చులు ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.